



# విశ్వవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 256 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ ఆదివారం 07 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-


## గొడ్డలి పార్టీ ఆగడాలు

# శ్రుతి మించితే వదిలిపెట్టం

- సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం
- పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతి మించితే వదిలిపెట్టబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణికమని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మనందరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం

మిగతా .. 2లో..

## తెదేపా రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు

సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లకు అవకాశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అధికారికంగా విడుదల చేశారు. జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో

మిగతా .. 2లో..

# అసలు నువ్వెవరు?

ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం

దేశానికి, తెలంగాణకు ఆయన చేసిన సేవ ఏంటని ఎద్దేవా

గద్దర్ విషయంలో పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు లేదని వ్యాఖ్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నటుడు ప్రకాశ్ రాజ్‌పై తెలంగాణ జనసేన నాయకుడు సాగర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే హక్కు ప్రకాశ్ రాజ్‌కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా సాగర్ ఘాటైన విమర్శలు చేశారు. "జనసేన ఒంటరిగా పోటీ చేస్తుందో, పొత్తుతో వస్తుందో ఆయనకెందుకు? అసలు ప్రకాశ్ రాజ్ ఎవరు? మేమెందుకు ఆయనకు సమాధానం చెప్పాలి?" అని సాగర్ సూటిగా నిలదీశారు. ప్రశాంతంగా ఉన్నవారిని కెలకడం ప్రకాశ్ రాజ్‌కు అలవాటని ఆరోపించారు. గద్దర్ అంశంపై మాట్లాడుతూ, "గద్దర్‌ను ఎవరు ఉపయోగించుకున్నారు? పవన్ కల్యాణ్ జేబు నుంచి నేరుగా డబ్బులు తీసుకునేంత చనువు తనకు ఉందని స్వయంగా గద్దరే చెప్పారు" అని ఆయన గుర్తుచేశారు. ప్రకాశ్ రాజ్ వృత్తిపరమైన ప్రవర్తనను కూడా సాగర్ ప్రశ్నించారు. "అసలు ఆయన ఎప్పుడైనా షూటింగ్‌కు సమయానికి వచ్చారా? మీరు ఎంత సహృదయులో మీ చిత్ర పరిశ్రమ వారిని అడిగితే తెలుస్తుంది" అంటూ ఎద్దేవా చేశారు. ఈ దేశానికి, ప్రత్యేకించి తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన తోడ్పాటు ఏమిటని సాగర్ ప్రశ్నించారు. "తెలంగాణ సాయుధ పోరాటం, రజాకార్ ఉద్యమంలో పాల్గొని కుటుంబాలను పోగొట్టుకుంది ప్రకాశ్ రాజా?" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "అసలు నువ్వెవరు ప్రకాశ్ రాజ్?" అని సూటిగా ప్రశ్నించిన ఆయన, తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన సేవ ఏంటని

మిగతా .. 2లో..

### హెచ్-1బీ వీసాపై.. అమెరికా కాంగ్రెస్‌లో

## కీలక బిల్లు




**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈనేపథ్యంలో హెచ్-1బీ వీసాలకు సంబంధించి అమెరికా కాంగ్రెస్ ముందుకు ఓ కీలక ముసాయిదా బిల్లు వచ్చింది. గ్రీన్ కార్డు పొందేందుకు హెచ్1బీ వీసాను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ.. దీనికి స్వస్తి పలకాలని కోరుతూ ఓ రిపబ్లికన్ నేత బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ సభ్యుడు చిప్‌రాయ్ గురువారం 'అమెరికన్ వైట్-కాలర్ వర్కర్ జాబ్స్' పేరుతో ఈ ముసాయిదా

మిగతా .. 2లో..

# ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం

రష్యాలో మంత్రి నారా లోకేష్ కీలక భేటీలు

సంక్షోభంలోనూ అవకాశాలు సృష్టించడమే నాయకత్వమన్న లోకేష్

ప్రవాస భారతీయులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారి అభివృద్ధిలో భాగం కావాలని పిలుపు

అమరావతి, విశాఖలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం యాండెక్స్ సంస్థతో కీలక చర్చలు

టీచర్లు లేని వినూత్న 'స్కూల్ 21'ను సందర్శించి, విద్యా విధానాలపై అధ్యయనం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** "సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వం. ఆంధ్రప్రదేశ్ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే అవకాశాలను సృష్టించేందుకే నేను రష్యాలో పర్యటిస్తున్నాను," అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. తన రష్యా పర్యటనలో ఐదో రోజు ఆయన మాస్కోలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. పెట్టుబడుల ఆకర్షణ, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు.

**ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశం**

మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ప్రవాస భారతీయుల (డయాస్పోరా) సమావేశంలో లోకేష్ ఉద్విగ్నభరితంగా ప్రసంగించారు. "మీరు భారతదేశాన్ని విడిచి వచ్చినా, భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. మాతృభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా, మన సంస్కృతి, సంప్రదాయాలను గుండెల్లో మోస్తున్న మీ విజయాలు దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాయి" అని ఆయన ప్రశంసించారు. భారత్-రష్యా బంధం అత్యంత విశ్వసనీయమైనదని, ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయకత్వంలో ఈ స్నేహం మరింత బలపడిందని అన్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ దేశ కీర్తిప్రతిష్టలను చారిత్రక శిఖరాలకు చేర్చారని కొనియాడారు.

**అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కండి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని లోకేష్ వివరించారు. "యువ జనాభా,

మిగతా .. 2లో..

### ఎం.ఎస్.ఎం. ఈ పార్కులు అభివృద్ధి,

# డ్వాక్రా సంఘాల బలోపేతం

నియోజవర్గ పరిధిలో మరిన్ని యూనిట్లు కొండపల్లి శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందే రీతిలో యువత, డ్వాక్రా సంఘాలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పన దిశగా

మిగతా .. 2లో..

### హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను

# దేశమంతా ఆసక్తిగా చూస్తోంది

తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. "ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా

మిగతా .. 2లో..

## వైసీపీని గండ్ర గొడ్డలి పార్టీగా మార్చారు

జగన్‌పై మంత్రి వాసంశెట్టి ఫైర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ తన సొంత ఇంటి నుంచే వెన్నుపోటు రాజకీయాన్ని ప్రారంభించారని, వెన్నుపోటు దినానికి ఆయనే కేరాఫ్ అడ్రస్ అని మండిపడ్డారు. కన్న తల్లిని, సొంత చెల్లిని కూడా జగన్ వదల్లేదని... బాబాయ్‌కి వెన్నుపోటుతో పాటు గొడ్డలి పోటు కూడా వేయించి వైసీపీని 'గండ్ర గొడ్డలి పార్టీ'గా మార్చారని విమర్శించారు. జగన్ మానసిక స్థితిపై కూడా మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్‌కు ఇచ్చే మందుల డోస్ పెంచితే ఏమవుతుందోనని వైద్యులు భయపడుతున్నారని... ఆయనకు

మిగతా .. 2లో..

### రాష్ట్రపతి పాలన నివారించేందుకే..

## ఓకే చెప్పాం : స్టాలిన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ సహా డీఎంకే కూటమి పక్షాలు మద్దతు ఇవ్వడంపై మాజీ ముఖ్యమంత్రి ఎం.కే స్టాలిన్ స్పందించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడాన్ని నివారించాలనే ఏకైక ఉద్దేశంతోనే టీవీకేకు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని పేర్కొన్నారు. ఏఐఏడీఎంకే పార్టీకి చెందిన కొందరు నేతలు డీఎంకేలో చేరిక సందర్భంగా చెన్నైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టాలిన్ ఈ విధంగా మాట్లాడారు. "టీవీకేతో వెళ్లే విషయాన్ని


మిగతా .. 2లో..

## రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ నామినేషన్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభ అభ్యర్థిగా జనసేన తరపున లింగమనేని రమేష్ అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేశారు. రమేష్ నామినేషన్‌పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు తెదేపా ఎమ్మెల్యేలు, ఒక భాజపా ఎమ్మెల్యే సంతకాలు చేశారు. రమేష్ వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్ నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, దేవ వరప్రసాద్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కాగిత కృష్ణ ప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, ఎన్ ఈశ్వర రావు (బీజేపీ) వెళ్లారు.

## రాయలసీమ జిల్లాలను తాకిన నైరుతి రుతుపవనాలు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లటి కబురు అందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలను నైరుతి రుతుపవనాలు తాకినట్లు భారత వాతావరణశాఖ తెలిపింది. ఈ నెల 10వ తేదీకల్లా ఏపీలో సగానికి పైగా భూభాగానికి రుతుపవనాలు తాకే అవకాశముందని పేర్కొంది. వచ్చే రెండు.. మూడు రోజుల్లో తొలకరి జల్లు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు గురువారం కేరళను తాకాయి. సాధారణంగా జూన్ ఒకటో తేదీ నాటికి

మిగతా .. 2లో..

### ట్రంప్-నెతన్యాహు

# స్నేహం చెడిందా..?

ఇజ్రాయెల్‌కు అమెరికా బర్నర్ ఫోన్లు




**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో యుద్ధం ముగింపు విషయంలో అమెరికా-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలకు మొగ్గు చూపుతుండగా.. ఇజ్రాయెల్ మాత్రం లెబనాన్‌పై దాడులు ఆపడం లేదు. ఇప్పటికే పశ్చిమాసియా ఘర్షణల్లో ఫలితం ఎటూతేలక అసహనంతో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. బెంజమిన్ నెతన్యాహుపై ఫైర్ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వాటికి

మిగతా .. 2లో..

### భూ కబ్జా కేసు..

## బొల్లా బ్రహ్మనాయుడికి రిమాండ్




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాలతో ఆయన్ను జైలుకు తరలించారు. గండిపేట సర్వేనెంబరు 18లో ఉన్న 9.28 ఎకరాల భూమిని బ్రహ్మనాయుడు గ్యాంగ్ కాజేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. శుక్రవారం కాంచీపురంలో

మిగతా .. 2లో..

### భారత్‌పై ఆంక్షలు పెడితే..

## అవి మీకే ఎదురుదెబ్బలవుతాయ్

పశ్చిమదేశాలకు పుతిన్ చురక



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశానికి బయటి నుంచి ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినప్పటికీ.. తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే వ్యవహరించిందని రష్యా అధ్యక్షుడు పుతిన్

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## శ్రుతి మించితే వదిలిపెట్టం

చేశారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. "మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్తా చదవాలని సూచించారు.

**'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మద్యపానం నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి 'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది. వారు చెప్పినవి చేయకపోగా, మేం నిర్వహిస్తున్న డీఎస్సీ-2025పై బురదజల్లారు. వివేకా హత్య విషయంలో ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో, డీఎస్సీ విషయంలోనూ అదే ప్రయత్నం చేశారు. కానీ మేం ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వడంతో వారు డిఫెన్స్‌లో పడ్డారు. ఫేక్ రాజకీయాలు చేయడమే గొడ్డలి పార్టీ సిద్ధాంతం" అని ఆయన విమర్శించారు. తాము అధికారంలో ఉన్నందున సహనంతో ఉంటామని, అయితే ప్రతిపక్షం ఆగడాలు శ్రుతి మించితే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "కూటమిగా వెళ్లాం కాబట్టే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచాం. ఓట్లు చీలకూడదనే బీజేపీతో పొత్తులో ఉన్నా టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కొనసాగించాలి" అని సూచించారు.

## తెదేపా రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

పార్టీ తరఫున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ బరిలో నిలవనున్నారు. వివరాల్లోకి వెళ్తే, రాజ్యసభ అభ్యర్థులుగా పారిశ్రామికవేత్త సానా సతీష్, ప్రముఖ విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య నేతగా ఉన్న చింతకాయల విజయ్‌లను ఎంపిక చేసినట్లు పార్టీ ప్రకటించింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కొంతకాలంగా పార్టీ వర్గాల్లో చర్చలు జరగ్గా, చివరికి అధిష్టానం ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేసింది. ఈ ముగ్గురిని చంద్రబాబు ఇవాళ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి స్వయంగా బి-ఫారాలు అందజేశారు. వారు సోమవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువడింది. కాగా, ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడం తెలిసిందే. కూటమి పొత్తు ధర్మం ప్రకారం నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయించగా, తమ అభ్యర్థిగా జనసేన పార్టీ లింగమనేని రమేష్ పేరును ఖరారు చేయడం తెలిసిందే.

## అసలు నువ్వెవరు?

నిలదీశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు.

**చిప్పకూడు తిన్నవారు కూడా నీతులు చెబుతున్నారన్న జనసేన నాయకుడు సాగర్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను రాజకీయ ప్రత్యర్థులు కావాలనే వక్రీకరిస్తున్నారని తెలంగాణ జనసేన నేతలు ఆరోపించారు. 'తెలంగాణ ఎవరి అయ్య జాగీరు కాదు' అంటూ పవన్ చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం వేరని వారు స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన కార్యక్రమానికి అనుమతి నిరాకరించిన నేపథ్యంలో పవన్ మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకలాపాలను అడ్డుకోవడాన్ని ప్రశ్నిస్తూ, రాష్ట్రాన్ని ఎవరూ సొంత ఆస్తిలా భావించవద్దని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో భవిష్యత్తులో జరగబోయే జీహెచ్‌ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంతో పాటు రాజకీయంగా విస్తరిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. పవన్ తెలంగాణ అస్తిత్వాన్ని, ఉద్యమాన్ని, ప్రజలను అవమానించారని మంత్రులు ఆరోపించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు నేతలు.. పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిడ్డల త్యాగాలతో ఏర్పడిన ఈ రాష్ట్రం ఇక్కడి భూమిపుత్రులదేనని బీఆర్ఎస్ నేత కవిత కౌంటర్ ఇచ్చారు. అవినీతి కేసులో తీహార్ జైల్లో చిప్పకూడు తిన్నవారు కూడా ఇప్పుడు నీతులు చెబుతుంటే వినాల్సి వస్తోందని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "అక్కా, తెలంగాణ ఉద్యమంలోకి మీరు ఎప్పుడు వచ్చారు? 2000 సంవత్సరంలో ఉద్యమం ప్రారంభమైనప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు? ఉద్యమంలో విద్యార్థులు లాఠీ దెబ్బలు తిన్నప్పుడు మీరు ఎక్కడున్నారు? ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో, ఇక్కడ డబ్బులు దండుకోవచ్చని అమెరికా నుంచి వచ్చారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. కవితకు ఇప్పుడు వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ఆయన ధ్వజమెత్తారు.

## అమెరికా కాంగ్రెస్‌లో కీలక బిల్లు

బిల్లును తీసుకొచ్చారు. విదేశీ విద్యార్థులు పట్టభద్రులైన తర్వాత పరిమిత కాలం పాటు అమెరికాలో పనిచేసేందుకు అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కూడా రద్దు చేయాలని ఇందులో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు నలభై ఏళ్ల చరిత్రలో హెచ్1బీ వీసా దుర్వినియోగం అయ్యిందన్నారు. దీని కారణంగా చౌకైన విదేశీ కార్మికుల కోసం.. అమెరికన్ STEM రంగాలకు చెందినవారిని పక్కనపెడుతున్నారని ఆరోపించారు. ఈ లాటరీ ఆధారిత విధానానికి ముగింపు పలకాలని కోరారు. దాని స్థానంలో ప్రతిభకు, వాస్తవ వేతన ప్రమాణాలను అమలుచేస్తూ.. అమెరికన్ వైట్ కాలర్ ఉద్యోగులకు ప్రాధాన్యమిచ్చే వ్యవస్థను తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ బిల్లుకు యూఎస్ టెక్ వర్కర్స్, ఇమిగ్రేషన్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమిగ్రేషన్ రిఫార్మ్ మద్దతు తెలిపాయి.

**భారతీయులు మా టార్గెట్ కాదు..**

హెచ్1బీ వీసాల నిబంధనలు కఠినతరం చేయడంపై భారతీయుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అమెరికా క్లారిటీ ఇచ్చింది. తమ దేశ వీసా చట్టాలు ప్రత్యేకంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకొని రూపొందించినవి కావని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ పేర్కొన్నారు. అన్ని దేశాలకూ అవే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టంచేశారు. 'గత ప్రభుత్వాలు వీసా చట్టాన్ని సరిగా అమలుచేయలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మేం వీటిని కచ్చితంగా అమలుచేస్తున్నాం. భారత్‌ను లక్ష్యంగా చేసుకునే వీసా చట్టాలు ఏవీ లేవు' అని ఆయన పేర్కొన్నారు.

## ఓకే చెప్పాం : స్టాలిన్

కూటమిలోని కొన్ని పార్టీలు నా దృష్టికి తీసుకురాగా.. 'మీరు వెళ్లొచ్చు. అది మీ ఇష్టం.. ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు. మిమ్మల్ని ఆపను' అని చెప్పాను. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడాన్ని నివారించాలనే ఏకైక ఉద్దేశంతో నేను వారిని అనుమతించాను. అలా చేయకపోతే తమిళనాడులో భాజపా పాలనకు మార్గం సుగమం అయ్యేది" అని స్టాలిన్ అన్నారు. తమ కూటమిలోని పార్టీలు మద్దతు ఇవ్వడం వల్లే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకే అధికారంలోకి రావాలనే ఆ పార్టీలు కోరుకున్నాయని, అందుకే తమతో పొత్తు కూడా పెట్టుకున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తమ పార్టీని నిరుత్సాహపరచలేవని.. ప్రతిపక్షంలో ఉంటూనే ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు.

## ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం

సుదీర్ఘ తీరప్రాంతం, ఆధునిక ఓడరేవులు మన బలం. పెట్టుబడులను ఆకర్షించి, వాటిని యువతకు ఉపాధిగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం," అని ఆయన తెలిపారు. గత రెండేళ్లలో ఏపీ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి ఏరోస్పేస్ వరకు అనేక రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. "మీరంతా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఒక్క పెట్టుబడి తీసుకురండి, యువతకు ఉద్యోగాలివ్వండి. మీకు ఏ సమస్య వచ్చినా ఏపీఎన్నార్టీ అండగా ఉంటుంది, ఆ బాధ్యత నాది," అని లోకేష్ భరోసా ఇచ్చారు. బలమైన భారత్ కోసం 'నమో' (నరేంద్ర మోదీ) అయితే, బలమైన ఆంధ్రప్రదేశ్ కోసం 'నమో' (నాయుడు-మోదీ) కలయిక పనిచేస్తోందని ఆయన అభివర్ణించారు. పర్యటనలో భాగంగా, రష్యాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ యాండెక్స్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. అమరావతి, విశాఖపట్నం నగరాల్లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, కంప్యూటరైజ్డ్ పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్ అమలుపై చర్చించారు. విశాఖపట్నాన్ని రష్యా, కామన్వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ మార్కెట్లకు ఎగుమతుల హబ్‌గా మార్చడమే లక్ష్యమని లోకేష్ తెలిపారు. ఈ పర్యటనలో మరో ముఖ్యమైన ఘట్టం, మాస్కోలోని వినూత్న పాఠశాల 'స్కూల్ 21'ను సందర్శించడం. స్బేర్ బ్యాంక్ ఆధ్వర్యంలో నడిచే ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక తరగతులు ఉండవు. మొత్తం మీద, మంత్రి లోకేష్ రష్యా పర్యటన కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా, విద్య, సాంకేతికత, నగరాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నూతన భాగస్వామ్యాలను నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ చిత్రపటాన్ని మార్చే దిశగా సాగుతోంది. ఈ సమావేశంలో లోకేష్ వెంట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, మాస్కోలోని భారత రాయబారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల బలోపేతం

ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సేర్ప్ సాధికారత, ఎన్.ఆర్.ఐ సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు రావులపాలెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి శ్మశాన వాటిక వరకు, అలాగే బేతేస్తు చర్చ్ వరకు వి.బీ.జి.రాంజీ నిధులైన రూ.1 కోటి వ్యయంతో నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు తో కలసి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక 6వ వార్డ్ వాటర్ ట్యాంక్ వీధిలో వి.బి.జి.రాంజీ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు శంకు స్థాపన చేసి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామ పంచాయతి నిధులతో రూ.12 లక్షల వ్యయంతో కాపు కళ్యాణ మండపం నుండి జి.సత్యవతి ఇంటి వరకు నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను వారు ప్రారంభించారు. తదుపరి కాపు కళ్యాణ మండపంలో అర్హులైన లబ్ధిదారులకు ఎం.ఎస్.ఎం.ఈ చెక్కుల పంపిణీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దార్శనికతతో స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అభివృద్ధిలో సమిష్టి భాగస్వామ్యం వహించాలన్నారు. ఇప్పటికే ముఖ్య మంత్రి చొరవతో ఐటీ రంగం ఆధారంగా ఎంతో మంది యువత ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో స్థిరపడ్డారని ఆయన గుర్తుచేశారు. ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం వహించాయన్నారు. ఆ దిశగా పరిశ్రమల స్థాపనకు ఎం.ఎస్.ఎం.ఇ యూనిట్లు స్థాపనకు యువత డ్వాక్రా సంఘాలు ముందుకు వస్తే ఆ దిశగా రాయితీలతో ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అభీష్టమైన రంగంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తే వివిధ రంగాల ద్వారా యూనిట్లు మంజూరు చేసి ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి డి.రాంబాబు, ఆర్డీవో జి.వి.వి సత్యనారాయణ, ప్రజా ప్రతి నిధులు క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీని గండ్ర గొడ్డలి పార్టీగా మార్చారు

అప్పుడప్పుడు కరెంట్ షాక్ లాంటి చికిత్స అవసరమని వ్యాఖ్యానించారు. జగన్ ప్రెస్‌మీట్లను ప్రజలు కేవలం 'స్ట్రెస్ రిలీఫ్' కోసం చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పేకాట క్లబ్‌లు, క్యాసినోలు నడిపించే బ్యాచ్‌కు విద్యా వ్యవస్థలోని బ్రిడ్జ్ కోర్సుల గురించి ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. వైసీపీ చేపట్టిన 'కోటి సంతకాల' కార్యక్రమం అభాసుపాలైందని, ప్రజల మద్దతు లేక వైసీపీ నేతలే మళ్లీ మళ్లీ సంతకాలు పెడుతూ ఇబ్బంది పడ్డారని మంత్రి సుభాష్ దుయ్యబట్టారు.

## రాయలసీమ జిల్లాలను తాకిన నైరుతి రుతుపవనాలు

కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉండగా మూడురోజులు ఆలస్యంగా చేరుకున్నాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు రుతుపవనాల సీజన్‌లో 90 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. రుతుపవనాలు తాకినా ఉక్కపోత, వేడిమి పరిస్థితులు వెంటనే తగ్గవని, దక్షిణ కోస్తాలో వేడిగాలుల ప్రభావం కొద్ది రోజులు ఉంటుందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

## స్నేహం చెడిందా..?

బలం చేకూరేలా మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్ పర్యటనల సందర్భంగా అమెరికా ప్రతినిధులు బర్నర్ ఫోన్లు (తాత్కాలికంగా వినియోగించేవి), కంప్యూటర్లను వాడుతున్నారని, అక్కడి హోటల్ గదుల్లో బస చేసినప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ అధికారులు సమాచార సేకరణలో ఎంత దూకుడుగా ఉంటారో అందరికీ తెలిసిందేనంటూ ఓ యూఎస్ అధికారి వ్యాఖ్యలను కథనాల్లో పేర్కొన్నాయి. మరోవైపు, ఇజ్రాయెల్ నుంచి గూఢచర్య ముప్పు తీవ్రతను గుర్తించిన పెంటగాన్ తమ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు సమాచారం. అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అంతర్గతంగా తన సిబ్బందికి ఈ మార్పు గురించి తెలియజేసిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియా ఘర్షణలపై ట్రంప్ యంత్రాంగం అంతర్గత చర్చలు, నిర్ణయాలను తెలుసుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నించే అవకాశం ఉందని పెంటగాన్ అనుమానిస్తోంది. అయితే ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. అమెరికా సంస్థలు, ప్రభుత్వ అధికారుల నుంచి తాము ఎలాంటి సమాచారం సేకరించడం లేదని వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ ఎంబసీ ప్రతినిధి వెల్లడించారు. ఇజ్రాయెల్ గూఢచర్య ప్రయత్నాలు శత్రువులే లక్ష్యంగా ఉంటాయన్నారు. దీనికి భిన్నంగా వచ్చే ఆరోపణలు నకిలీవని, రాజకీయ ప్రేరేపితమైనవని చెప్పారు. వైట్‌హౌస్ అధికారి ఒకరు కూడా ఈ గూఢచర్య కథనాలను తోసిపుచ్చారు. అంతర్గత విషయాలపై ఏమాత్రం అవగాహన లేని వ్యక్తి ఇచ్చిన సమాచారమే ఇలాంటి వార్తలకు కారణమన్నారు. మామూలుగా అమెరికా, ఇజ్రాయెల్ అత్యంత సన్నిహిత దేశాలు. కొన్ని దశాబ్దాలుగా వాటి నిఘా సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి. అయితే ప్రస్తుతం వస్తోన్న ఆరోపణలు ఈ నమ్మకాన్ని దెబ్బతీస్తాయేమోనని మాజీ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక, బర్నర్ ఫోన్లు అంటే.. తాత్కాలిక అవసరాల కోసం వినియోగించే ప్రీపెయిడ్ ఫోన్లు. తాత్కాలిక ఉపయోగం తర్వాత ఆ ఫోన్‌ను, సిమ్‌కార్డును పారవేస్తారు. లేదంటే బర్న్ చేస్తారు. ఫోన్ నంబర్‌ను, సమాచారాన్ని ఎవరూ ట్రేస్ చేయకుండా, గోప్యత కోసం వీటిని వాడుతుంటారు.

## బొల్లా బ్రహ్మనాయుడికి రిమాండ్

ఆయన్ను అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు ట్రాన్సిట్ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చారు. వివిధ కోణాల్లో ప్రశ్నించారు. కడపలోని వైకాపా నేతలతో లావాదేవీలపై కూడా ప్రశ్నించి, వాంగ్మూలం నమోదు చేశారు. వెల్లి రాధాకృష్ణ, నిమ్మల దశరథ కుటుంబంతో లావాదేవీలపై ఆరా తీశారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా.. ఈ మేరకు రిమాండ్ విధించింది.

## దేశమంతా ఆసక్తిగా చూస్తోంది

తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోంది. ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలి" అని సీఎం తెలిపారు.

### పొలాల్లో ఎండమావులు...

## ఊళ్లలో వలసల జాతర!

తెలుగు రాష్ట్రాల గుండె చప్పుడు వ్యవసాయం నేడు ఒక తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో, రైతుల పండు వెన్నెల నవ్వులతో కళకళలాడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పల్లెలు నేడు వెలవెలబోతున్నాయి. ఊళ్లలో యువత కరువవుతోంది, ముసలివారు మాత్రమే మిగిలి పొలాన్ని చూస్తూ నిట్టూరుస్తున్నారు. యువ రైతులు పట్టణాలకు వలస బాట పడుతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక, పెరిగిన అప్పుల భారం భరించలేక, అవమానం తట్టుకోలేక రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న దృశ్యాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ విషాదానికి మూల కారణమేంటని ఆర్థిక నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధిస్తే, ఒక చేదు నిజం బయటపడుతుంది అది ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇస్తున్న విచ్చలవిడి ఉచిత పథకాలే!జాతీయ నమూనా సర్వే సంస్థ గణాంకాలు విస్తుగొలిపే నిజాలను చెబుతున్నాయి. 2001లో ఆంధ్రప్రదేశ్‌లో 1.23 కోట్ల వ్యవసాయ కుటుంబాలు ఉండగా, నేడు ఆ సంఖ్య 89 లక్షలకు పడిపోయింది. తెలంగాణలో 68 లక్షల రైతు కుటుంబాలలో కేవలం 52 లక్షలు మాత్రమే ఇప్పటికీ వ్యవసాయంలో కొనసాగుతున్నాయి. గత రెండు దశాబ్దాల్లో దాదాపు 50 లక్షల మంది రైతులు తమ వృత్తిని, భూమిని వదిలేశారు. ఇది కేవలం గణాంకం కాదు, ఒక జాతీయ విషాదం. తరతరాలుగా నమ్ముకున్న భూమిని వదిలి, నగరాల్లో అనామకులుగా బతుకుతున్న ఈ లక్షలాది మంది ఎక్కడికి వెళ్లారు? వారి ఆత్మగౌరవం ఏమైంది? 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే, భయంకరమైన వాస్తవాలు కనిపిస్తాయి.తెలుగు రాష్ట్రాల ప్రస్తుత ఆర్థిక స్థితిని పరిశీలిస్తే ఆందోళన కలిగించే వాస్తవాలు కళ్ళకు కడతాయి. ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పు రూ.4,56,000 కోట్లుగా ఉండగా, తెలంగాణ రాష్ట్ర అప్పు ఏకంగా రూ.7,00,000 కోట్లకు పైగా చేరుకుంది. ఈ అప్పుల కుంపటికి ప్రధాన కారణం ప్రభుత్వాలు అమలు చేస్తున్న విచ్చలవిడి ఉచిత పథకాలే. ప్రజాకర్షక పథకాల పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా రూ.72,000 కోట్లు, తెలంగాణ ప్రభుత్వం రూ.68,000 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఈ ఆర్థిక నిర్వహణ లోపం వల్ల సామాన్య ప్రజలపై విపరీతమైన భారం పడుతోంది. తలసరి అప్పు భారాన్ని గమనిస్తే ఆంధ్రప్రదేశ్ పౌరుడిపై రూ.82,000 పైన, తెలంగాణ పౌరుడిపై ఏకంగా రూ.1,85,000కు పైగా అప్పు ఉంది. ఈ సంఖ్యలు మనస్సును కలచివేస్తాయి. ప్రతి తెలంగాణ పౌరుడు పుట్టిన శిశువు నుండి వృద్ధుడి వరకు సగటున రూ.1,85,000 అప్పును తన భుజాలపై మోస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి కూడా భిన్నంగా లేదు. ఈ అప్పులు ఎందుకు పెరిగాయి? కేవలం ఉచితాల కోసం! సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు చేస్తున్న తాయిలాలు రాష్ట్రాల పునాదులను దెబ్బతీస్తున్నాయి.ప్రస్తుతం అమలులో ఉన్న కొన్ని ముఖ్యమైన ఉచిత/పథకాలు.రైతులకు ఉచిత విద్యుత్ (9 గంటలు)రైతు భరోసా / రైతు బంధు రూ.10,000/ఎకరా,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం (మహాలక్ష్మి పథకం)అమ్మ వడి / గసం రూ.15,000, నిరుద్యోగ భృతి రూ.3,000-4,000, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు & ఉచిత బియ్యం పంపిణీఈ పథకాల ఉద్దేశం పేదలకు అండగా ఉండటమే కావొచ్చు, కానీ వీటి అమలు తీరు రైతన్నను నిరాశ్రయుడిని చేస్తోంది. ప్రభుత్వం ఓటు కోసం ఇచ్చే రూ.10,000 సాయం రైతుకు ఒక సీజన్ పెట్టుబడికి కూడా సరిపోదు, కానీ అదే ప్రభుత్వం మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించకపోవడం వల్ల రైతు పంటను అమ్ముకోలేక నష్టపోతున్నాడు. పాల్కూరు మండలానికి చెందిన 28 ఏళ్ల రమేష్ కథే రెండు తెలుగు రాష్ట్రాల యువ రైతుల పరిస్థితికి అద్దం పడుతోంది. ఐదు ఎకరాల పొలం ఉన్నా, అందులో వచ్చే ఆదాయం కంటే నగరంలో ఆటో నడపడం మేలని అతను భావిస్తున్నాడు. నెల నెలా నిరుద్యోగ భృతి వస్తోంది, బస్సులో ఉచిత ప్రయాణం, రేషన్ బియ్యం దొరుకుతున్నాయి. మరి పొలంలో ఎండలో కష్టపడితే వచ్చేదేంటి? అని అతను అడుగుతున్నాడు. ఈ మాటలో ఉన్నది కేవలం సోమరితనం కాదు, ప్రభుత్వాలు సృష్టించిన ఉచితాల సంస్కృతి వల్ల పని పట్ల తగ్గిన గౌరవం. వ్యవసాయం చేయడం అంటే కష్టమని, దానికి బదులుగా ప్రభుత్వ సాయం మీద ఆధారపడటం సులభమని యువత భావించేలా పాలసీలు తయారయ్యాయి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2023 నివేదిక ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం తన రాజస్వంలో 78% కేవలం జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, మరియు ఉచిత పథకాలకే వెచ్చిస్తోంది. అంటే, రోడ్లు, విద్య, నీటి పారుదల వంటి మూలధన వ్యయం కోసం కేవలం 22% మాత్రమే మిగులుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరీ దారుణం. రాష్ట్రం ఏటా రూ.1.1 లక్ష కోట్ల వడ్డీలు మాత్రమే చెల్లిస్తోంది. ఇది రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ కంటే ఐదు రెట్లు ఎక్కువ! గ్రామీణ యువతలో 61% మంది "ఉచిత పథకాలు అందుబాటులో ఉన్నాయి కదా, కష్టపడే పని ఎందుకు?" అని వ్యవసాయ కూలీ పనులను తిరస్కరిస్తున్నారు. ఉచిత విద్యుత్ భారాన్ని భరించలేక తెలంగాణ DISCOMs నష్టాలు రూ.12,000 కోట్లు దాటాయి. డెల్టా ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం 18% తగ్గింది. 2015లో 45 లక్షల హెక్టార్లుగా ఉన్న వరి సాగు, నేడు 38 లక్షలకు పడిపోయింది.ఉచిత పథకాలు పూర్తిగా చెడ్డవి కావు. విద్య, వైద్యం, మరియు నిజమైన పేదరికంలో ఉన్నవారికి ఇచ్చే సహాయం అవసరమే. కానీ, ఓటు బ్యాంకు కోసం ఇచ్చే విచ్చలవిడి తాయిలాలు రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నాయి.మనం చేయాల్సింది ఏంటి? ఉచిత డబ్బులు పంచడం కంటే, ఆ నిధులతో గ్రామీణ పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. రైతుకు రూ.10,000 నగదు ఇచ్చే కంటే, అతని పంటకు రూ.10,000 అదనపు లాభం వచ్చేలా మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయాలి.వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి, నీటి పారుదల సౌకర్యాలను కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి ఉచిత పథకం ప్రవేశపెట్టే ముందు, అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని పారదర్శకంగా వెల్లడించాలి.రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటి ఉంది అప్పు చేసి పప్పుకూడు పెట్టడం వల్ల ప్రజలు బతకరు, అప్పుల ఊబిలో కూరుకుపోతారు. నేడు తెలుగు రైతన్న ఆత్మహత్యలకు పరోక్ష కారణం ఈ ఆర్థిక విధానాలే. ఈ హెచ్చరికను ప్రభుత్వాలు, సమాజం ఇప్పుడు గుర్తించకపోతే, రేపటి తరం పంట పండించే చేతులే మిగలవు. ఆ రోజు ఎవ్వరికీ మంచిది కాదు. మార్పు మొదలు కావాలి ఓటు బ్యాంకు నుంచి అభివృద్ధి పథం వైపు!

**డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

**భారత్‌పై ఆంక్షలు పెడితే..**

## అవి మీకే ఎదురుదెబ్బలవుతాయ్

వ్యాఖ్యానించారు. రష్యాతో సంబంధాల విషయంలో కూడా మున్ముందు అలాగే వ్యవహరిస్తుందన్నారు. ఆంక్షల రూపంలో భారత్‌ను ఇబ్బందిపెడితే.. అవి తిప్పికొడతాయంటూ పశ్చిమదేశాలకు చురకలు అంటించారు. "భారత్ సార్వభౌమాధికార దేశం. ప్రధాని మోదీ నాయకత్వంలోని భారత్‌కు ఆంక్షల పేరిట ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే... అవి వారికే ఎదురుదెబ్బలవుతాయి. అక్కడి ప్రజలకు అనుకూలమైన ఉత్పత్తులను ఎంచుకోవడానికి ఆ దేశానికి స్వేచ్ఛ ఉంది. ఎవరు ఎలాంటి వ్యాఖ్యలు చేసినా.. భారత్ తన వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటోంది" అని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరుగుతోన్న ఆర్థిక సదస్సులో పుతిన్ మాట్లాడారు. గాఖ-57, ఎస్-500 వంటి రష్యా రక్షణ ఉత్పత్తులను భారత్ ఒకవేళ కొనుగోలు చేస్తే.. అమెరికా (ఖూూా) నుంచి ఆంక్షలు ఎదురుకావొచ్చేమోనని అడిగిన ప్రశ్నకు పుతిన్ బదులిచ్చారు. జాతీయ ప్రయోజనాలకు అనుగుణమైన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని భారత్ అవలంబిస్తోందని పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. భారత్-అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే భారత్‌లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పర్యటించారు. భారత్ తమకు కీలక భాగస్వామి అని పేర్కొన్నారు. అనంతరం అమెరికా వెళ్లిన ఆయన మన దేశాన్ని ఇబ్బందిపెట్టేలా వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురుపై ఇచ్చిన మినహాయింపులను వీలైనంత త్వరగా తొలగించాలని భావిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం వేళ.. ఆ చమురు భారత్‌కు కీలకమన్న సంగతి తెలిసిందే.

## ఎడిటర్ వాయిస్

# ఎండలకు వీడ్కోలు.. ఏపీని తాకిన నైరుతి

ఏపీ ప్రజలకు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం లభించనుంది. రెండు రోజుల క్రితం కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు ఈ రోజు రాష్ట్రంలో అడుగుపెట్టాయని భారత వాతావరణ శాఖ అధికారులు అధికారికంగా వెల్లడించారు. ప్రస్తుతం రుతుపవనాలు రాష్ట్రంలో చురుగ్గా కదులుతుండటంతో వాతావరణం చల్లబడే అవకాశం ఉందని చెబుతున్నారు. నిజానికి ఈ ఏడాది మూడు రోజుల ఆలస్యంగా రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయని చెబుతున్నారు. ఎల్ నినో భయాల మధ్య రుతుపవనాలు సమయానికి రావడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

**రాయలసీమ, దక్షిణ కోస్తాలో విస్తరణ**

రుతుపవనాలు ఇప్పటికే రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో విస్తరిస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవి మరింత ముందుకు సాగడానికి, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి వాతావరణం ఎంతో అనుకూలంగా ఉందని ఐఎండీ అధికారులు పేర్కొన్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు కూడా రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని చెబుతున్నారు. రుతుపవనాల రాకతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రుతుపవనాల కదలికలు చురుగ్గా ఉన్నందున, రైతులు తమ వ్యవసాయ పనులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చునని స్పష్టం చేస్తున్నారు. అయితే, భారీ వర్షాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**తగ్గనున్న ఎండల తీవ్రత**

గత కొన్ని వారాలుగా భానుడి కారణంగా తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోయిన జనం ఈ చల్లటి కబురుతో ఊపిరి పీల్చుకుంటున్నారు. రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గి వాతావరణం ఆహ్లాదకరంగా మారుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత విపరీతంగా ఉంటోంది. దాదాపు 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో



జనం నరకం అనుభవిస్తున్నారు. జూన్ రావడంతోనే వాతావరణం చల్లబడుతుందని ఆశించినా తొలి వారం మాత్రం ఎండ మంటలు తప్పలేదని వాపోతున్నారు. ఇక రుతుపవనాలు రాకతోనైనా పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైం వాయిస్

# కుమారుడి కళ్లెదుటే కిరాతకం.. భార్యను హత్య చేసిన భర్త



**ఆలస్యంగా ఇంటికొస్తోందనే అనుమానంతో...**

**రాజేంద్రనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలస్యంగా ఇంటికొస్తోందనే కారణంతో భార్యపై అనుమానం పెంచుకున్న భర్త... ఆమెపై దాడిచేసి హతమార్చిన ఉదంతమిది. 'నాన్నా.. అమ్మను చంపొద్దంటూ' కన్నబిడ్డ వేడుకుంటున్నా... ప్రాణభయంతో ఆ ఇల్లాలు పరుగెడుతున్నా లక్ష్యపెట్టకుండా కిరాతకంగా దాడిచేసి ఆమెను అంతమొందించిన కిరాతకుడి కథ ఇది. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి తేజస్వీనీనగర్‌లో చోటుచేసుకుందీ దారుణం. అత్తాపూర్ ఎస్సై పార్వతి కథనం ప్రకారం... నాందేడ్‌కు చెందిన కోమలి(31), అవినాష్ దంపతులకు 8, 9 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. 6 నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఈ కుటుంబం.. అత్తాపూర్ తేజస్వినినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో పనికి కుదిరింది. కోమలి కాపలాదారుగా ఉంటూ అదే భవనంలోని పలువురి ఇళ్లలో పనిచేస్తోంది. అవినాష్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇళ్లలో పనిచేసేందుకు వెళ్లిన కోమలి.. ఆలస్యంగా ఇంటికి వస్తోందనే కారణంతో అవినాష్ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. గురువారం రాత్రి మద్యం తాగి వచ్చిన అవినాష్.. ఇదే విషయమై భార్యతో గొడవకు దిగాడు. శుక్రవారం తెల్లవారుజాము వరకు గొడవ కొనసాగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన అవినాష్.. భార్యపై కత్తితో దాడికి దిగాడు. గమనించిన పెద్ద కుమారుడు.. అమ్మని చంపొద్దంటూ తండ్రిని వేడుకున్నా లక్ష్యపెట్టలేదు. ఈ తరుణంలో అతని బారినుంచి తప్పించుకున్న కోమలి కేకలు పెడుతూ..బయటకు పరుగెత్తగా అవినాష్ వెంటపడ్డాడు. ఒక దశలో చేతిలో ఉన్న కత్తి జారిపోగా..అక్కడే ఉన్న స్క్రూడ్రైవర్‌తో ఇష్టానుసారం పొడవడంతోపాటు రాడ్డుతో దాడిచేశాడు. బాధితురాలి ఆర్తనాదాలు విని అపార్ట్‌మెంట్ వాసులు బయటకు రావడంతో అవినాష్ అక్కణ్నుంచి పరారయ్యాడు. స్థానికులు బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. కాసేపటికే ఆమె మృతి చెందింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మూడెకరాల సర్వేకు రూ.25 వేల లంచం

**రూ.10 వేలు తీసుకుంటూ అనిశాకు పట్టుబడ్డ సర్వేయర్**



**సైదాపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** మూడెకరాల భూమిని సర్వే చేసేందుకు రూ.25 వేలు డిమాండ్ చేసి... రూ.10 వేలు లంచం తీసుకుంటూ కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సర్వేయర్ కుమారస్వామి అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు పట్టుబడ్డారు. అనిశా డీఎస్పీ విజయ్‌కుమార్ కథనం మేరకు.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన రైతు మహేందర్‌కు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మనగుర్తి గ్రామ శివారులో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. భూమిని సర్వే చేయాలని కోరుతూ మహేందర్ మే 17న తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. సర్వేయర్ కుమారస్వామి మే 23న రైతును సంప్రదించాడు. సర్వే చేసేందుకు రూ.25 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఆ మేరకు రైతు తొలుత రూ.5 వేలు యూపీఐ ద్వారా సర్వేయర్‌కు పంపించారు. మొత్తం డబ్బులిస్తేనే సర్వే చేస్తానని తేల్చిచెప్పడంతో... ఈ నెల 2న సర్వేయర్ ప్రైవేట్ సహాయకుడు విహిత్‌రెడ్డి ద్వారా మరో రూ.10 వేలు అందజేశారు. మిగిలిన సొమ్ము కూడా ఇవ్వాల్సిందేనని సర్వేయర్ పేర్కొనడంతో... మహేందర్ అనిశాను ఆశ్రయించారు. శుక్రవారం మధ్యాహ్నం సోమారం గ్రామకూడలి వద్ద తన మరో ప్రైవేట్ సహాయకుడు రాజేశ్ ద్వారా రూ.10 వేలు తీసుకుంటుండగా సర్వేయర్ కుమారస్వామి, ఆయన సహాయకుడిని అనిశా డీఎస్పీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు పున్నం చందర్, ప్రేమ్‌కుమార్‌ల బృందం పట్టుకుంది. ఈ మేరకు సర్వేయర్ కుమారస్వామితోపాటు ఆయన ఇద్దరు సహాయకులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

# ఐపీఎస్ అధికారిణికీ తప్పని అసభ్య కామెంట్లు..

## విజయవాడలో కేసు నమోదు

**సూర్యారావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ ట్రాఫిక్ డీసీపీపై ఫేస్‌బుక్‌లో అసభ్య కామెంట్లు చేసినవారిపై విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదుచేశారు. ట్రావెల్స్ బస్సుల్లో భద్రతపై ట్రాఫిక్ డీసీపీ తనిఖీలు చేస్తున్న వీడియోపై ఈ అనుచిత కామెంట్లు చేశారు. తనిఖీ చేయడమే పాపమైనట్లు అసభ్య వ్యాఖ్యలు పెట్టారు.

**మురికి కామెంట్లు**

ఇటీవల ప్రైవేటు ట్రావెల్స్ వరుస ప్రమాదాల దృష్ట్యా ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం.. మార్చి నెలాఖరులో అర్ధరాత్రి సమయంలో విజయవాడలో పలుచోట్ల తనిఖీలు చేశారు. పలు బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు లేకపోవడం, డ్రైవర్లు ఏకరూప దుస్తులు వేసుకోకపోవడాన్ని గమనించి.. ఆమె వారిని నిలదీశారు. తనిఖీల వీడియోలను 'ఏపీ స్మార్ట్‌న్యూస్' ప్రతినిధి వారి ఫేస్‌బుక్‌లో ఏప్రిల్ 1న అప్‌లోడ్ చేశారు. ఈ వీడియో కింద పలువురు మురికి వ్యాఖ్యలు పెట్టారు. నవీన్‌దేవ్, బి.నరసింహ బిఎన్ఆర్, ఎంపవన్ ఎంపవన్ అనే ఐడీల నుంచి ట్రాఫిక్ డీసీపీ పరువు, ప్రతిష్ఠలను దెబ్బతీసేలా అసభ్యకర కామెంట్లు పెట్టారు. విధుల్లో ఉన్న ఆమె యూనిఫాం వేసుకోకుండా.. డ్రైవర్‌ను నిలదీయడమేంటని కామెంట్లు పోస్టు చేశారు. వీటిపై ఏపీ స్మార్ట్‌న్యూస్ ప్రతినిధి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు.. కేసు నమోదుచేశారు. ఈ ఫేస్‌బుక్ ఐడీలను ఉపయోగించేవారి సమాచారమివ్వాలని ఫేస్‌బుక్ సంస్థను కోరారు.

# ఆర్టీసీ బస్సులో పొగలు..

**ప్రయాణికులకు తప్పిన ప్రమాదం**



**ఎన్టీఆర్ జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో ఆర్టీసీ ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. జగ్గయ్యపేట నుంచి విజయవాడకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు.. గొల్లపూడికి వచ్చేసరికి ఇంజిన్ క్యాబిన్‌లో మంటలు చెలరేగి పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును రహదారి పక్కకు నిలిపివేశారు. దీంతో బస్సులోని ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో కారులో మంటలు..

**హైవేపై వాహనం దగ్ధం**

**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి జాతీయ రహదారిపై ఓ కారు దగ్ధమైంది. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కావడంతో కారులో మంటలు చెలరేగాయి. దీంతో పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. ప్రమాద సమయంలో కారులో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించి వెంటనే వాహనం నుంచి దిగేయడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. కారు ప్రొద్దుటూరు నుంచి పెంచలకోన వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

# కుప్పకూలిన హోటల్ స్లాబ్.. పలువురికి గాయాలు



**మర్పల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** వికారాబాద్ జిల్లా మర్పల్లిలో శనివారం మధ్యాహ్నం ఓ హోటల్ స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జేసీబీ సాయంతో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద ఇంకెవరైనా ఉన్నారా? అని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆరా తీస్తున్నారు.

# నెయ్యి గోదాములో భారీ అగ్ని ప్రమాదం



**తణుకు, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం తేతలి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని నెయ్యి గోదాములో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గోదాము లోపల ఒక్కసారిగా మంటలు చెలరేగి సరకు మొత్తం కాలిపోయింది. ప్రస్తుతం గోదాములో కొంతకాలంగా అల్లం, వెల్లుల్లిపాయలు నిల్వచేసి ప్యాకింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాదంలో గోదాములోని సరకుతో పాటు కారు కూడా దగ్ధమైంది. నష్టం భారీగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. యజమాని అందుబాటులో లేకపోవడం వల్ల ఎంత నష్టం అనేది చెప్పలేమని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

# సహజీవనం తీసింది ప్రాణం.. అనాథలైన నలుగురు పిల్లలు

**కాసిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పెద్దల తప్పు నలుగురు చిన్నారులను అనాథలుగా చేసిన విషాద ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది. కాసిపేట మండలం దేవాపూర్ ఎస్ఐ గంగారాం వివరాల ప్రకారం.. మందమర్రి మండలం బురదగూడెనికి చెందిన లక్ష్మి(40), లింగయ్య దంపతులకు నలుగురు సంతానం. రెండేళ్ల క్రితం లింగయ్య భార్య, పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. లక్ష్మి కూలీ పనులు చేసుకుంటూ పిల్లలతో జీవనం సాగించింది. ఈ క్రమంలోనే కాసిపేట మండలంలోని మల్కపల్లికి చెందిన సంతోష్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. దీంతో ఆరు నెలల క్రితం పిల్లలను వదిలేసి.. మల్కపల్లిలో సంతోష్‌తో సహజీవనం సాగిస్తోంది. అయితే.. మరో వ్యక్తితో సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో సంతోష్ ఆమెపై దాడి చేసి హతమార్చాడు. రోడ్డు ప్రమాదానికి గురైందని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి కాసిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. శరీరంపై గాయాలు గమనించిన వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గంగారాం ఆసుపత్రికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహంపై గాయాల ఆధారంగా హత్య చేసి ఉండొచ్చని ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంతోష్ మొదటి భార్య గతంలోనే వదిలేసి వెళ్లిపోయింది. తర్వాత మరో మహిళతో సహజీవనం చేశాడు. ఆమె కూడా అనుమానాస్పద స్థితిలోనే మృతి చెందింది.

## బిజినెస్ వాయిస్

# అబ్బబ్బా.. ఒక్కసారిగా బంగారం ధరలు ఢమాల్..

**ఒక్కరోజే భారీగా పతనం.. ప్రస్తుతం ఎంతంటే..?**



దేశంలో బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. గత కొద్ది రోజులుగా కుప్పకూలుతూ వస్తోన్నాయి. అంతర్జాతీయంగా సానుకూల పరిణామాలే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉద్రిక్తతలు తగ్గి సానుకూల ధోరణి ఉంది. ఈ కారణంగా ధరలు కూడా అదుపులో ఉంటున్నాయి. బంగారం కొనుగోలు చేసేవారికి భారీ ఊరట దక్కింది. గోల్డ్ రేట్లు భారీగా తగ్గుముఖం పట్టాయి. గత కొద్దికాలంగా ధరలు పడిపోతూ వస్తోన్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలపడటం, ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, ముడి చమురు ధరలు అదుపులోకి వస్తున్న క్రమంలో గోల్డ్ రేట్లపై వీటి ప్రభావం పడుతుంది. అంతర్జాతీయ పరిస్థితులను బట్టి బంగారం ధరల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రస్తుతం ప్రపంచస్థాయిలో యుద్ధాలు, ఉద్రిక్తతలు తగ్గి సానుకూల వాతావరణం ఉండటంతో గోల్డ్ రేట్లు డౌన్ అవుతున్నాయి. శనివారం మరోసారి గోల్డ్ రేట్లు తగ్గాయి. అనంతరం దేశంలోని ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం.

**గోల్డ్ రేట్లు ఇలా..**

-దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,52,730 వద్ద కొనసాగుతోండగా.. నిన్నటితో పోలిస్తే ఇవాళ ఒక్కారోజే ఏకంగా రూ.3 వేలు తగ్గింది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1.40 లక్షలుగా ఉంది. ఇవాళ ఒక్కరోజే రూ.2,750 తగ్గింది.

-హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,730 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1.40 లక్షల వద్ద ఉంది

-చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,910 వద్ద ఉండగా.. ఒక్కరోజే రూ.3050 తగ్గింది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1.42 లక్షలుగా ఉంది. శనివారం రూ.2300 పడిపోయింది

-బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,730గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1.40 లక్షల వద్ద ట్రేడవుతోంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,910 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,40,150 వద్ద ఉంది.

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..?**

-దేశ రాజధాని ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర రూ.2.65 లక్షల వద్ద ప్రస్తుతం ఉంది. శుక్రవారం రూ.2.75 లక్షల వద్ద స్థిరపడింది


-హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2.70 లక్షల వద్ద ఉంది. నిన్న రూ.2.80 లక్షలుగా ఉంది. ఇవాళ రూ.10 వేలు తగ్గింది

-చెన్నైలో కేజీ వెండి ధర రూ.2.70 లక్షల వద్ద ఉంది. శుక్రవారం రూ.2.80 లక్షల వద్ద కొనసాగుతోంది

**మాంసం ప్రియులకు బ్యాడ్ న్యూస్..**

# భారీగా పెరగనున్న చికెన్, కోడి గుడ్ల ధరలు..!






దేశంలో చికెన్, కోడిగుడ్ల ధరలు భారీగా పెరగనున్నాయి. త్వరలో ధరలు భారీగా హైక్ కానున్నాయి. నాన్ వెజ్ ప్రియులకు ఇది పెద్ద షాక్‌గా చెప్పవచ్చు. దేశంలో కోళ్ల ఉత్పత్తిని భారీగా తగ్గించేందుకు పౌల్ట్రీ వర్గాలు సిద్ధమవుతున్నాయి. ఈ కారణం వల్ల ధరలు తగ్గే అవకాశముంది. మాంసం ప్రియులకు బ్యాడ్ న్యూస్. త్వరలో చికెన్, కోడి గుడ్ల ధరలు పెరగనున్నాయి. ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింది. కోళ్ల మేత ధరలు విపరీతంగా పెరగడంతో పాటు రాన్నున్న నెలల్లో పండుగల సీజన్ వస్తున్న క్రమంలో దేశంలో కోళ్ల ఉత్పత్తిని భారీగా తగ్గించాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు 25 శాతం మేర ఉత్పత్తిని తగ్గించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బహదూర్ అలీ ప్రకటించారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. కోళ్ల దాణాతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు కూడా పెరిగిపోయాయి. కోళ్లకు సోయాబీన్ మీల్ దాణాగా వేస్తుంటారు. ఇటీవల వీటి ధరలు పెరిగాయి. ఒక్క నెలలోనే వీటి ధర 40 శాతానికిపైగా పెరిగింది. దీని వల్ల కోళ్ల పెంపకందారులకు నిర్వహణ ఖర్చులు పెరగ్గా.. లాభాలు కూడా తగ్గిపోయాయి. ఈ క్రమంలో పెరుగుతున్న ఖర్చులను తగ్గించేందుకు కోళ్ల ఉత్పత్తిని తగ్గించాలని పౌల్ట్రీ వర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. అంతేకాకుండా జులై నుంచి అక్టోబర్ వరకు అనేక పండుగలు వస్తున్నాయి. శ్రావణ మాసం, నవరాత్రి లాంటివి రానున్నాయి. ఈ సమయంలో నాన్ వెజ్ విక్రయాలు సాధారణంగా తగ్గడం వల్ల మాంసానికి డిమాండ్ కూడా ఎక్కువగా ఉండదు. దీంతో ఉత్పత్తిని తగ్గించాలని పౌల్ట్రీ పరిశ్రమ నిర్ణయించింది. కోళ్ల ఉత్పత్తిని తగ్గించడం వల్ల చికెన్, కోడి గుడ్ల ధరలు పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇక ఉత్పత్తిని తగ్గించే చర్యలో భాగంగా పెంపకందారులు పిల్లలను ఉత్పత్తి చేసే తల్లి కోళ్లను పెద్ద సంఖ్యలో తొలగిస్తున్నారు. దీంతో కోడి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. గతంలో బ్రీడర్ కోడి ఒక్కొకటి రూ.140కి అమ్ముడుపోయేది. కానీ ఇప్పుడు రూ.65 పలుకుతోంది. అయితే దాణా ఖర్చులకు సంబంధించి సోయాబీన్ మీల్ దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని పౌల్ట్రీ పరిశ్రమలు కోరుతున్నాయి. కొంతమంది దేశంలో కావాలని కృతిమ కొరత సృష్టిస్న?న్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. తమ వ్యాపారాన్ని వృద్ధి చేసేందుకు కొంతమంది కలిసి కృతిమ కొరత సృష్టిస్న?న్నారని చెబుతున్నారు. ప్రభుత్వంపై వీరిపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ప్రస్తుతం చికెన్ ధరలు ప్రాంతాన్ని బట్టి రూ.250 నుంచి రూ.300 మధ్య పలుకుతున్నాయి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 07 జూన్, 2026




www.viswamvoice.com

## ఆంధ్ర పేపర్ కార్మికుల పోరాటానికి బీజేపీ అండ

**కాంట్రాక్టు, పర్మనెంట్ కార్మికుల హక్కుల కోసం పోరాటానికి సిద్ధం : జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర**



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముందు కుదిరిన జీతాల ఇంక్రిమెంట్ అగ్రిమెంట్ ప్రకారం 2023 జనవరి నుంచి జీతాలు పెంచాల్సి ఉండగా.. నిర్లక్ష్యం వహిస్తూ కార్మికుల జీవితాలతో ఆడుకుంటూ జీతాలు పెంచని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ యాజమాన్యంపై శాంతియుతంగా దీక్ష చేస్తున్న కాంట్రాక్టు మరియు పెర్మనెంట్ కార్మికులు. ఇప్పటికి 40 రోజులు గడిచాయి. రెండుసార్లు పేపర్ మిల్లు యాజమాన్యంతో లేబర్ డిపార్ట్మెంట్ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కార్మికుల నాయకులు చర్చలు జరిపినా ఫలితం లభించలేదు. లేబర్ డిపార్ట్మెంట్ అధికారుల మాటను కూడా పేపర్ మిల్లు యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర స్పందించి శనివారం బిజెపి బృందంతో కలిసి కడియం ఆంధ్ర పేపర్ లిమిటెడ్ వద్ద దీక్ష చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ.. కడియం ఆంధ్ర పేపర్ లిమిటెడ్ కార్మికులు పడుతున్న విషయం బిజెపి దృష్టికి వచ్చింది. ఒప్పందం ప్రకారం జీతాలు పెంచాలని పొట్టకూడు కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు బిజెపి అండగా ఉంటుంది. ఇంతవరకూ కార్మికులను ఏడిపించింది చాలు, వెంటనే యాజమాన్యం స్పందించి గత ఒప్పందం ప్రకారం కార్మికుల జీతాలను పెంచి, కార్మికులందరినీ సర్వీసులోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఒకవేళ యాజమాన్యం ఇప్పటికైనా స్పందించకపోతే కార్మికుల తరుపున బిజెపి పోరాటానికి సిద్ధం, కార్మికుల ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా ముందుకు వెళతామని, తదుపరి కార్యాచరణ 2 రోజులలోనే ప్రకటిస్తామని పిక్కి నాగేంద్ర తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కడియం మండల అధ్యక్షులు బొరుసు సుబ్రహ్మణ్యం, ఆంధ్ర పేపర్ లిమిటెడ్ కాంట్రాక్టు మరియు పెర్మనెంట్ కార్మికులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు చెప్పులు పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం ఉదయం శ్రీగౌతమి జీవకారుణ్య వృద్ధాశ్రమంలో దాతలు దేవకివాడ చక్రపాణి, తిరుమలరావు ఆధ్వర్యంలో వృద్ధులకు చెప్పులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జనసేన పార్టీ రాజమండ్రి సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, గౌతమీ జీవకారణ సంఘం చైర్మన్ వర్రె శ్రీనివాస్, జనసేన నాయకులు వైవిడి ప్రసాద్, గుత్తుల సత్యనారాయణ, నల్లంశెట్టి వీరబాబు, గుణ్ణం శ్యాంసుందర్, అల్లాటి రాజు, తోర్లపాటి శాలిని, బూడిద గౌతమి, విన్నా వాసు, వడ్డది ఇంద్ర, పొట్నూరి ఠాగూర్, పిల్లి ప్రసాద్, దేశినీడి రాంబాబు,నర్సిపూడి రాంబాబు, గుణ్ణం దుర్గాప్రసాద్, పొన్నాడ శ్రీనివాస్, బోయలపల్లి సుందరయ్య, రాజేశ్వరి, మేకల సునీల్, బొట్టా మహేష్ , పరమేష్, జనసేన వీర మహిళలు జనసేన అభిమానులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో మైనారిటీలకు రక్షణ లేదు

**తాడేపల్లి మైనార్టీ సమావేశంలో మండపేట మైనార్టీ అధ్యక్షులు వలిసాహెబ్**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పేదలైన ముస్లింల ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని మోసపు హామీలు గుప్పించి ఓటేయించుకున్న చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచాడని వైయస్సార్సీపీ మైనారిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో తాడేపల్లిలో మైనారిటీ విభాగం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబుకి అలవాటైపోయిందని మండిపడ్డారు. కూటమి పాలనలో మైనారిటీలకు ప్రోత్సాహం, గౌరవం మాత్రమే కాకుండా కనీసం రక్షణ కూడా కరువైందని ధ్వజమెత్తారు. దివంగత వైయస్సార్ తర్వాత మైనారిటీల పక్షాన నిలబడి రాజకీయంగా ప్రోత్సహించిన ఘనత వైయస్ జగన్‌కే దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న ఓటర్ లిస్టు సవరణ విషయంలో మైనారిటీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఓటు విషయంలోనూ జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఈ సమావేశం అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి మండపేట నియోజకవర్గ ముస్లిం మైనారిటీల స్థితిగతులను వారు కూటమి పాలన ఏర్పడినప్పటి నుంచి పడుతున్న ఇబ్బందులను నియోజకవర్గ మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ వలి సాహెబ్ తెలియజేయడం జరిగిందన్నారు. రాబోయే స్థానిక, అసెంబ్లీ ఎన్నికలలో ముస్లిం మైనార్టీలు అందరు కూడా వైయస్సార్ పార్టీ విజయానికి కృషి చేస్తామని తోట త్రిమూర్తులును ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు.

## గ్రామ సంఘం సహాయకులకు సమీక్ష సమావేశం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల సమాఖ్య స్త్రీ శక్తి భవనమునందు గ్రామ సంఘం సహాయకులకు మండల సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణకుమారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ ఫైనాన్స్ వారు మాట్లాడుతూ మన డబ్బులు, మన లెక్కలు అనే కార్యక్రమం సంఘ సభ్యులందరికీ తెలియాలని, సంఘ సభ్యులందరూ తమ రుణాలు, వివిధ రకాల ఆర్థిక లావదేవులన్నీ వారి యొక్క చరవాణి ద్వారా తెలుసుకొనే విధంగా అవగాహన కల్పించాలని మరియు వార్షిక రుణ జీవనోపాదుల ప్రణాళిక వందశాతం పూర్తి కావాలని తెలియజేశారు.అదే విధంగా గ్రామ సంఘం ఆర్థిక లావదేవీలన్నీయు తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సూరమ్మ, సిసి వెంకటలక్ష్మి, హరిబాబు, ధారా లక్ష్మి మరియు గ్రామ సంఘం సహాయకులు పాల్గొన్నారు.

### నేడు సిపిఐఎంఎల్ ఆధ్వర్యంలో

## భూమిలేని పేదల హక్కుల కోసం పాదయాత్ర

**ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని రాష్ట్ర కార్యదర్శి వీరబాబు పిలుపు**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భూమిలేని పేదల సమస్యల పరిష్కారం, నివాస హక్కులు మరియు జీవనోపాధి అంశాలపై అవగాహన కల్పించేందుకు సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో నేడు పాదయాత్రనిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివేల వీరబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ పాదయాత్రకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ఘంటా గణేష్‌రావు ఆసుపత్రి వద్ద ఈ రోజు సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమై, సెంటర్‌లోని సీపీఐ(ఎంఎల్) పార్టీ కార్యాలయం వరకు కొనసాగుతుందని చెప్పారు. భూమిలేని నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారికి న్యాయం జరిగేలా పోరాటాలు కొనసాగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పాదయాత్రకు రాజకీయ పార్టీలు, కులాలు, వర్గాలకు అతీతంగా మండలంలోని అన్ని కులాల ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ప్రజా ఉద్యమమని వివరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.పాదయాత్ర అనంతరం సీపీఐ(ఎంఎల్) కార్యాలయం వద్ద సభ నిర్వహించి భూమిలేని పేదల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై చర్చించ నున్నట్లు తెలిపారు.కార్యక్రమ ఏర్పాట్లు పూర్తయ్యాయని, స్థానిక నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు వెల్లడించారు.

## పుష్కర పనులకు ప్రస్తుత ఎస్ఎస్ఆర్ రేట్లు సరిపోవు..

**ప్రత్యేక జీఓ తీసుకురావాలి - పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ ఉండదు - సబ్కా అధ్యక్షుడు చల్లా సురేష్ కుమార్ వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెటీరియల్, లేబర్ వ్యయాలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత ఎస్-ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) రేట్లతో పనులు చేపట్టడం కాంట్రాక్టర్లకు తీవ్ర భారం అవుతోందని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) జిల్లా అధ్యక్షుడు చల్లా సురేష్ కుమార్ అన్నారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రత్యేక జీవో జారీ చేసి రేట్లు సవరించాలని, లేకుంటే టెండర్లు వచ్చినా పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తిచేయడం కష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు. పాత సోమాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల సమస్యలు, పుష్కరాల అభివృద్ధి పనులు, ఎస్ఎస్ఆర్ రేట్ల సవరణ, బ్యాంకు రుణాల సమస్యలు, రోడ్డు విస్తరణ వంటి పలు అంశాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రస్తుత ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) రేట్లు ఏమాత్రం సరిపోవని, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక జీవో తీసుకువచ్చి ధరలను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం నిర్ణయించే ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరలకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయన్నారు. కంకర, ఐరన్, బిటుమెన్, సిమెంట్, డీజిల్, రవాణా ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వ రేట్లలో తగిన మార్పులు లేకపోవడం వల్ల కాంట్రాక్టర్లు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడు సంవత్సరాలుగా ఎక్కువ మంది కాంట్రాక్టర్లు నష్టాలతోనే పనులు చేస్తున్నారని చెప్పారు. ఒక ప్రాజెక్టులో కాంట్రాక్టర్‌కు గరిష్టంగా 10 నుంచి 15 శాతం మాత్రమే మార్జిన్ ఉంటుందని, మిగిలిన నిధులన్నీ కార్మికులు, రవాణా, మెషినరీ, పరిశ్రమలు, వడ్డీలు తదితర ఖర్చులకే వెళ్తాయని వివరించారు. గోదావరి పుష్కరాలకు సుమారు ఏడాది సమయం మాత్రమే మిగిలి ఉందని, ఇప్పటికైనా ప్రత్యేక జీఓ జారీ చేసి ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలని కోరారు. లేనిపక్షంలో టెండర్లు వచ్చినా పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండదన్నారు. పుష్కరాలకు సంబంధించిన పనులు సాధారణ పనులు కావని, లక్షలాది మంది భక్తులు వచ్చే నేపథ్యంలో నాణ్యతతో పాటు సమయపాలన కూడా అత్యంత కీలకమని చెప్పారు. ప్రస్తుత రేట్లతో టెండర్లు పిలిస్తే సరైన స్పందన రాకపోవచ్చన్నారు.

**నాణ్యత విషయంలో రాజీ లేదు**

కాంట్రాక్టర్లపై నాణ్యతలేని పనులు చేస్తున్నారనే విమర్శలు చేయడం సరికాదని సురేష్ అన్నారు. ప్రస్తుతం ప్రతి ప్రాజెక్టుపై మూడు దశల్లో తనిఖీలు జరుగుతున్నాయని, థర్డ్ పార్టీ ఆడిట్, శాఖాపరమైన తనిఖీలు, విజిలెన్స్ పరిశీలనలు జరుగుతున్నాయని చెప్పారు. రెండు సంవత్సరాల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ఉన్నందున కాంట్రాక్టర్ నిర్మించిన రోడ్డు, డ్రెయిన్ లేదా భవనానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని, అందువల్ల నాణ్యతలో రాజీకి అవకాశం లేదన్నారు. కాగా రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత తీవ్రంగా ఉందని సురేష్ చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికుల సంఖ్య తగ్గిందని, అందుబాటులో ఉన్న కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. ప్రభుత్వం స్థానిక యువతకు నిర్మాణ రంగంలో ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చి స్కిల్డ్ లేబర్‌ను తయారు చేయాలని సూచించారు. దీంతో రాష్ట్ర అభివృద్ధి పనులకు ఉపయోగపడటంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.

**బ్యాంకు రుణాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి**

కాంట్రాక్టర్లకు వర్కింగ్ క్యాపిటల్ ప్రధాన సమస్యగా మారిందని ఆయన చెప్పారు. భారీ విలువైన టెండర్లు సాధించినప్పటికీ బ్యాంకులు తగిన రుణాలు మంజూరు చేయకపోవడంతో పనులు ముందుకు తీసుకెళ్లడం కష్టమవుతోందన్నారు. రైతులకు ఇచ్చే విధంగా కాంట్రాక్టర్లకు కూడా సులభ రుణాలు, తక్కువ వడ్డీతో ప్రత్యేక పథకాలు అమలు చేయాలని కోరారు. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

**రోడ్డు విస్తరణపై స్పష్టత ఇవ్వాలి**

నగరంలో పుష్కరాల దృష్ట్యా చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులపై ఇప్పటికీ స్పష్టత లేదని సురేష్ అన్నారు. ఏ రోడ్లను విస్తరించాలనుకుంటున్నారో ముందుగానే ప్రకటించి, భూసేకరణ, టిడిఆర్ తదితర ప్రక్రియలు పూర్తి చేసిన తరువాతే టెండర్లు పిలవాలని సూచించారు. రోడ్లు విస్తరించడం వల్ల ఆస్తుల విలువలు పెరగడమే కాకుండా నగర అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారు. పుష్కరాల నిర్వహణ కోసం అవసరమైన ఇంజినీరింగ్, టెక్నికల్, డ్రాఫ్టింగ్ సిబ్బందిని ముందుగానే నియమించాలని ఆయన కోరారు. స్థానిక పరిస్థితులు అర్థం చేసుకోవడానికి అధికారులకు సమయం అవసరమని, చివరి నిమిషంలో నిర్ణయాలు తీసుకుంటే పనులపై ప్రభావం పడుతుందని అన్నారు.

## రాజ్యసభను ఖరీదైన వేదికగా మార్చేసిన చంద్రబాబు, పవన్

**ప్రజా సమస్యల కంటే కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్దపీట : మేడా శ్రీనివాస్**




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభ స్థానాల కేటాయింపులో ధనికులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్దల సభను సామాన్య ప్రజలకు అందని ద్రాక్షగా మారుస్తోందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నాయకుడు మేడా శ్రీనివాస్ ఓ ప్రకటనలో తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం విడుదల చేసిన విస్తృత ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాజ్యసభ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన సభ అని, రాష్ట్రాల ప్రయోజనాలను జాతీయ స్థాయిలో ప్రతిబింబించే వేదికగా రాజ్యాంగ నిర్మాతలు దానిని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అలాంటి సభలో సామాజిక ఉద్యమకారులు, రైతు నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, విద్యావేత్తలు, ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ప్రస్తుతం రాజ్యసభ స్థానాలు ప్రజా సేవా నేపథ్యం ఉన్నవారికి కాకుండా, ఆర్థికంగా బలమైన వర్గాలకు, కార్పొరేట్ సంస్థలతో సంబంధాలు ఉన్న వ్యక్తులకు కేటాయిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. దీంతో సాధారణ ప్రజల సమస్యలు, గ్రామీణ ప్రాంతాల కష్టాలు, రైతాంగ సంక్షోభం, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలు పెద్దల సభలో చర్చకు రావడం తగ్గిపోతోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ధనికులకే పరిమితం కాకూడదని, ప్రజల కోసం పోరాడిన వ్యక్తులకు కూడా చట్ట సభల్లో ప్రాతినిధ్యం దక్కేలా రాజకీయ పార్టీలు వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే, ప్రజల కంటే పెట్టుబడిదారుల అభిప్రాయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. రాజ్యసభలో రైతు సమస్యలు, వ్యవసాయ సంక్షోభం, యువత ఉపాధి, ప్రభుత్వ విద్యా వ్యవస్థ, వైద్య సేవలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై బలమైన చర్చలు జరగాల్సి ఉండగా, కార్పొరేట్ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలే ఎక్కువగా వినిపించే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే పరిణామమని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి, విభజన హామీలు, పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి వంటి కీలక అంశాలను జాతీయ స్థాయిలో బలంగా వినిపించగల నాయకులను రాజ్యసభకు పంపాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి సమయంలో ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన నాయకులను పక్కనపెట్టి ధనిక వర్గాలకు అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రయోజనాలకు కూడా నష్టం కలిగిస్తుందని తెలిపారు. రాజ్యసభ అనేది ప్రజల ఆశయాలకు ప్రతిబింబంగా ఉండాలని, కార్పొరేట్ బోర్డు గదుల పొడిగింపుగా మారకూడదని మేడా శ్రీనివాస్ అన్నారు. ప్రజా సమస్యలను దేశ అత్యున్నత వేదికలో వినిపించే నాయకులకు అవకాశం కల్పించేందుకు రాజకీయ పార్టీలు తమ విధానాలను పునఃసమీక్షించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## వెదురుపాక శ్రీ విజయదుర్గా పీఠాధిపతి గాడ్ మృతి

**పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వేగుళ్ళ**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలం, వెదురుపాకలోని శ్రీ విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) 90 సంవత్సరాలు శుక్రవారం రాత్రి వృద్దాప్యం కారణంగా మృతి చెందారు. వెదురుపాకలో శనివారం గాడ్ పార్థివ దేహానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972 లో శ్రీ విజయదుర్గా పీఠాన్ని స్థాపించి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తన ఆధ్యాత్మిక బోధనలతో వేలాది మంది భక్తులకు మార్గదర్శకంగా గాడ్ నిలిచారన్నారు. దాదాపు 54 సంవత్సరాలుగా భక్తులకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించారన్నారు. తన బోధనలతో దేశ విదేశాల్లోని భక్తుల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. అటువంటి వ్యక్తి మన మధ్యనలేకపోవటం భాదకరం అని ఎమ్మెల్యే అన్నారు. గాడ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ అమ్మవార్ని పార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి చంటి రెడ్డి, సత్తి శ్రీనివాస్ రెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, ఎం.శ్రీదేవి, బత్తుల ఏసు తదితరులు ఉన్నారు.



# ఎంఎస్ఎంఈలతో ప్రతి ఇంటిలోనూ ఒక పారిశ్రామికవేత్త

## ఎమ్మెల్యే సతానందరావు హెల్ప్ డెస్క్‌పై మంత్రి ప్రశంసలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీపై వైసీపీది దుష్ప్రచారం గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి తోనే జీడీపీ గ్రోత్ రేటులో పెరుగుదల మంత్రి కొండపల్లి ఎమ్మెల్యే సతానందరావు హెల్ప్ డెస్క్‌పై మంత్రి ప్రశంసలు కొండపల్లి కుటుంబంతో అనుబంధం గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే రాష్ట్రంలో ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామిక వేత్త ఉండాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యానికి అనుగుణంగానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఎంఎస్ఎంఈ, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ, ట్రైకార్ రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్2047 లక్ష్యానికి అనుగుణంగా జీడీపీ గ్రోత్ రేటు పెరగాలంటే ఖచ్చితంగా గ్రామీణ పారిశ్రామిక ప్రగతి మెరుగుపడాలన్నారు. ఎమ్మెల్యే సత్యానందరావు ఓ వినూత్న ఆలోచనతో నియోజకవర్గ ప్రజల ఆలోచనలు ఆవిష్కృతం అయ్యేందుకు ప్రత్యేకంగా ఇద్దరు ఉద్యోగులతో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని కొనియాడారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చినట్టుగా 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ఎంఎస్ఎంఈ క్లస్టర్లను ఎక్కడికక్కడ అభివృద్ధి చేస్తూ యువకుత స్థానికంగానే ఉపాధి దొరికేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బ్యాంకర్లు కూడా సులభంగా రుణాలు ఇస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

**డీఎస్సీపై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్ చేసి 16 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని ప్రతిపక్షాన్ని ప్రజలు నమ్మకపోవడంతో డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. డీఎస్సీపై వైసీపీ చేసిన ఆరోపణలను అధికారులు డేటాతో సహా విశ్లేషించి అవి అసత్య ఆరోపణలు అని తేల్చిచెప్పారని వైసీపీ అబద్ధాలను రాష్ట్ర ప్రజలు అందరూ గమనించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.గత ప్రభుత్వం జీతాలే టైంకు ఇవ్వలేదు గత ప్రభుత్వంలో జీతాలే సరైన టైంకు ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇవ్వడంతో పాటు పెన్షన్లు సైతం 1వ తేదీనే ఇస్తున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో చిన్న చిన్న రహదారులు, మరమ్మతులు కూడా చేయలేదని రావులపాలెం లో కోటి రూపాయలతో చిన్న వీధులకు కూడా రహదారులు పూర్తి చేసి ప్రారంభించినప్పుడు అక్కడ ప్రజలు తన దగ్గర ఎంతో సంతోషం వ్యక్తం చేశారని మంత్రి తెలిపారు.

**నాడు డ్వాక్రా నేడు ఎంఎస్ఎంఈ**

ముఖ్యమంత్రి చంద్రబాబు 30 ఏళ్ల క్రితమే మహిళలకు స్వావలంభన కోసం డ్వాక్రా స్థాపించి వారి అభివృద్ధికి బాటలు వేశారని ఈ రోజు ఎంఎస్ఎంఈతో మహిళలను కూడా పారిశ్రామిక వేత్తలుగా చేయాలన్న సంకల్పంతో ఉన్నారని ఆయన ఇస్తోన్న అవకాశాలు అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. 76 ఏళ్ల వయస్సులో నవ యువకుడిగా పని చేస్తున్నారని ఆయన అనుభవమే ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతోందని మంత్రి తెలిపారు.

**వంటింటి కుందేళ్లను ఆకాశాంలో కూర్చోపెట్టిన ఘనత బాబుదే ఎమ్మెల్యే బండారు**

30 ఏళ్ల క్రితం తాను కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినప్పుడు మహిళలకు బయటకు వచ్చేవారు కాదని వంటింటి కుందేళ్లుగా ఉన్న వారిని డ్వాక్రా సంఘాలతో ఆర్థికంగా బలోపేతం అయ్యేలా చేసి ఈ రోజు ఎంఎస్ఎంఈలతో మహిళా పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తోన్న గొప్ప దార్శనికుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. కొత్తపేట నియోజకవర్గంలోనే మహిళా పారిశ్రామిక వేత్తలకు 82 యూనిట్స్‌కు గాను రు. 1.60 కోట్ల సబ్సిడీతో రు. 4.83 కోట్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మంత్రి కొండపల్లి కుటుంబంతో తనకు ఎంతో అనుబంధం ఉందని. ఆయన యువకుడిగా తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారని మీ పిల్లలు కూడా అభివృద్ధి చెందాలంటే మీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అందుకు ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహకాలు అందిపుచ్చుకుని ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో ఉన్న కళాకారుడికి చేయూత



## పండు మాస్టర్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ కొరియోగ్రాఫర్, తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన పండు మాస్టర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారుల పట్ల తనకున్న అభిమానాన్ని, బాధ్యతను చాటుకుంటూ మంత్రి సుభాష్ సూచన మేరకు 'సత్యం వాసంశెట్టి ఫౌండేషన్' ద్వారా రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం నేరుగా ఆసుపత్రికి వెళ్లి పండు మాస్టర్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆ సమయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చరవాణి (ఫోన్) ద్వారా పండు మాస్టర్‌తో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. ప్రమాదం నుంచి త్వరగా కోలుకుని మళ్లీ తన ప్రతిభతో ప్రేక్షకులను అలరించాలని ఆకాంక్షించారు. కళాకారులు సమాజానికి స్ఫూర్తిదాయకులని వారి కష్టసుఖాల్లో అండగా నిలవడం తమ బాధ్యతని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కళాకారులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం కళాకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. కాగా ఈ ఏడాది జనవరిలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిర్వహించిన "సంక్రాంతి ఉత్సవ్-2026"లో పండు మాస్టర్ తన బృందంతో చేసిన ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. తమ కష్టకాలంలో స్పందించి ఆర్థిక సాయం అందించిన మంత్రి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు పండు మాస్టర్ మరియు ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రైతులకు సకాలంలో ఎరువుల పంపిణీ

## 'APAIMS' యాప్‌పై డీలర్లు, పీఏసీఎస్ సీఈఓలకు శిక్షణ




**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీని పారదర్శకంగా సకాలంలో అందించేందుకు మండల వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో శనివారం ద్రాక్షారామం రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్. మణిదీప్ ఆధ్వర్యంలో మండలంలోని ఎరువుల రిటైల్ వ్యాపారులు మరియు పీఏసీఎస్ సొసైటీల ప్రతినిధులకు 'APAIMS' యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ 2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండలంలో సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ సీజన్ ఎరువుల పంపిణీ ప్రధానంగా 'ఖరీఫ్ 2025' ఈ-క్రాప్ డేటా ఆధారంగా జరుగుతుందని ఎరువులు పొందాలనుకునే ప్రతి రైతు తప్పనిసరిగా ఇందులో నమోదై ఉండాలని తెలిపారు. ఒకవేళ ఖరీఫ్ 2026 ఈ-క్రాప్ డేటాలో గానీ, కౌలు వివరాల్లో గానీ ఏవైనా మార్పులు ఉంటే, రైతులు వెంటనే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి సవరణలు చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎరువుల విక్రయాలలో పాటించాల్సిన నియమాలపై శిక్షణలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రైతుల భూమి విస్తీర్ణం మరియు వారు సాగు చేసే పంటకు శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మోతాదు మేరకు మాత్రమే ఎరువులను విక్రయించాలని పంట అవసరాలకు అనుగుణంగా దఫాల వారీగా పంపిణీ చేయాలని తెలిపారు. ఎలాంటి అక్రమ విక్రయాలకు తావు లేకుండా అర్హులైన నిజమైన రైతులందరికీ ఎరువులు అందేలా చూడాలని రిటైల్ డీలర్లు, సొసైటీలను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మండలంలోని అన్ని పీఏసీఎస్ సీఈఓలు మరియు రిటైల్ డీలర్లు తప్పనిసరిగా 'APAIMS' యాప్‌లో లాగిన్ అయ్యి సిద్ధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మేక సురేష్‌తో పాటు పలువురు డీలర్లు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో రూ.1.52 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## 703 మంది లబ్ధిదారులకు రూ.111.19 కోట్ల రుణాల పంపిణీ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేలా యువత, డ్వాక్రా సంఘాలను ప్రోత్సహిస్తూ ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ సాధికారత, ఎన్ఆర్ఐ సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం రావులపాలెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి శ్మశానవాటిక వరకు, అలాగే బేతేస్తా చర్చ్ వరకు విబిజి రాంజీ నిధులతో రూ.1 కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 6వ వార్డు వాటర్ ట్యాంక్ వీధిలో విబిజి రాంజీ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ నిధులతో రూ.12 లక్షల వ్యయంతో కాపు కళ్యాణ మండపం నుంచి జి. సత్యవతి ఇంటి వరకు నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ప్రారంభించారు. తదుపరి కాపు కళ్యాణ మండపంలో అర్హులైన లబ్ధిదారులకు ఎంఎస్ఎంఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి దార్శనికతతో స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐటీ రంగం అభివృద్ధి కారణంగా రాష్ట్రానికి చెందిన యువత ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. పరిశ్రమల స్థాపన, ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు యువత, డ్వాక్రా సంఘాలు ముందుకు వస్తే రాయితీలు, ప్రోత్సాహకాలతో సహకరిస్తామని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే వివిధ పథకాల ద్వారా యూనిట్లు మంజూరు చేసి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. యువతకు అవకాశాలు కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా కాపు కళ్యాణ మండపంలో 703 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంఎస్ఎంఈ, ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ, పీఎం అజయ్, ట్రైకార్ రుణాల కింద మంజూరైన రూ.111 కోట్ల 19 లక్షల విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధి, డ్వాక్రా సంఘాల బలోపేతం కోసం నియోజకవర్గానికి మరిన్ని యూనిట్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డి. రాంబాబు, ఆర్డీవో జి.వి.వి. సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# విన్నకోట జయశ్రీకి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం రావులపాలెం గ్రామానికి చెందిన విన్నకోట జయశ్రీ (వయస్సు 51)కి 5 నెలల క్రితం తలలో బ్లీడింగ్ అయి రెండు ఆపరేషన్‌లు చేయించారు. 10 లక్షల వరకు ఖర్చు అయ్యింది. ప్రతీ నెల మందులకి 10 వేల రూపాయలు వరకు ఖర్చు అవుతుంది. వీరి పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా సంస్థ నుండి 10000 రూపాయలు సంస్థ సభ్యులు కే పావని 1000 రూపాయలు మొత్తం 11000 రూపాయలు విన్నకోట జయశ్రీ చేతికి సంస్థ సభ్యుల ద్వారా ఇవ్వడం జరిగింది. దీనికి సహకరిస్తున్న సంస్థ సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేశారు

# శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదాయం రూ.2,61,829/-



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు మరియు ఇతర పూజల ద్వారా ఆదాయం వివరాలు ముఖమండపం ఏకాదశ రుద్ర తైలాభిషేకం మహాన్యాస పూర్వక తైలాభిషేకం తైలం సమర్పించి దర్శనం తిలదానం స్వయం హోమం మొత్తం రూ.1,27,065 (ఫోన్ పే) ద్వారా రూ.15,525/- పరోక్ష పూజలు ద్వారా రూ.82,400/- అన్నప్రసాదం విరాళాలు రూ.36,839/-మొత్తం రూ.2,61,829/-ఆదాయం వచ్చిందని దారపురెడ్డి సురేష్ బాబు సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# 15 రోజులు ప్రతీ రోజూ సాయంత్రం యోగా, మెడిటేషన్




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం, మందపల్లి నందు కమీషనరు, దేవదాయ ధర్మదాయ శాఖ వారి ఆదేశముల మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ఉత్సవములు సందర్భంగా ది.7-6-2026 నుండి 21-6-2026 వరకు అనగా 15 రోజులు ప్రతీ రోజూ సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు యోగా మరియు మెడిటేషన్ కార్యక్రమములు జరుగును. కావున యావన్మంది భక్తులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసినదిగా కోరడమైనదని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# రామచంద్రాపురంలో ఘనంగా బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకుల పిలుపు



**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రామచంద్రాపురం పట్టణ కార్యవర్గ సమావేశం పట్టణంలోని సాయిబాబా గుడి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడింది. పట్టణ పార్టీ అధ్యక్షులు దునే శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అడబాల సత్యానారాయణ, అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ కర్రి చిట్టిబాబు, సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, నియోజకవర్గం బి.ఎల్.ఏ-1 సలాది శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబులతో పాటు పట్టణ కార్యవర్గ సభ్యులు, యువమోర్చా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తద్వారా సామాన్య ప్రజలకు పార్టీ చేరువ కావాలని సూచించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు కార్యకర్త అంకితభావంతో సమిష్టిగా పనిచేయాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు వివరిస్తూనే, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధిలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సంస్థాగత నిర్మాణాన్ని మరింత దృఢం చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

**ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో**

# 15 రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు


## ఆసక్తి గల భక్తులు రిజిస్టర్ చేసుకోవాలని సూచన



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు ద్రాక్షారామ శ్రీ మాణిక్యంబా సమేత భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో యోగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జూన్ 7వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు మొత్తం 15 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయి. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి ఈ యోగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఈ శిక్షణలో పాల్గొనడానికి ఆసక్తి గల భక్తులు మరియు స్థానిక గ్రామస్తులు ముందుగా దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని ఆలయ అధికారులు కోరారు. యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆశిస్తున్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.


**ద్రాక్షారామ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న**

# బీహార్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం ఉదయం బీహార్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. అభిషేక్ రెడ్డి గారు తన కుటుంబ సభ్యులతో కలిసి ద్రాక్షారామ శ్రీ మాణిక్యంబా సమేత భీమేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి అర్చకులు మరియు అధికారులు సాంప్రదాయ పద్ధతిలో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్న జస్టిస్ అభిషేక్ రెడ్డికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. దర్శనానంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను మరియు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# ద్రాక్షారామ శాఖ గ్రంథాలయంలో ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక శాఖ గ్రంథాలయంలో సుమారు 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శనివారం ఘనంగా ముగిసింది. గ్రంథాలయ అధికారి ఎం.వి. సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు కార్యక్రమం ప్రార్థన గీతంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సాహిత్య గోదావరి సంస్థ సభ్యులు ర్యాలీ శ్రీనివాస్, బి. గౌరీ శంకర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు బి. శివరావు, సత్యనారాయణ మరియు సదాశివం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ర్యాలీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు జరిగిన ఈ శిబిరంలో క్రాఫ్ట్, డ్రాయింగ్, యోగ వంటి అంశాలపై విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన శిక్షణ అందించామని వేసవి సెలవులను విద్యార్థులు ఎంతో సద్వినియోగం చేసుకున్నారని కొనియాడారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు శివరావు మాట్లాడుతూ ఇటువంటి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, జ్ఞాన సముపార్జనకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. శిబిరంలో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్, క్రాఫ్ట్ పోటీలలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అలాగే, పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహిస్తూ అందరికీ కన్సోలేషన్ బహుమతులను పంపిణీ చేశారు. చివరగా గ్రంథాలయ అధికారి ఎం.వి. సూరిబాబు వందన సమర్పణతో కార్యక్రమం ముగించారు.



# 15 ఏళ్లుగా అవిరామ సామాజిక సేవ చేస్తున్నాం

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 15 ఏళ్లుగా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ కేంద్రంగా సాయి ప్రియా సేవా సమితి తరపున నా సొంత సొమ్ములతో కాకినాడ జిల్లా వ్యాప్తంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడు తున్నామని కాకినాడ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, గొల్లప్రోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు, సాయి ప్రియా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాల నిర్వహణకు ఎవరి నుంచి ఏ విధమైన చందాలు, విరాళాలను స్వీకరించడం లేదని ఆయన స్పష్టం చేశారు. పిఠాపురం పశువుల సంతలో రైతుల సమక్షంలో 200 వ వారం అన్నదాన ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురం మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెన్నా జగదీష్, గొల్లప్రోలు మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పాలశెట్టి తమ్మారావు, పిఠాపురం జనసేన పార్టీ అధ్యక్షురాలు చిక్కాల వరలక్ష్మి, గొల్లప్రోలు జనసేన పార్టీ అధక్ష్యులు మామిడాల సూరిబాబు, భవిరిశెట్టి రాంబాబు, వాకపల్లి సూర్యప్రకాష్ కేకును కోసి కేకును, స్వీట్లను సభికులకు పంచారు. తర్వాత 200 వ వారం డొక్కా సీతమ్మ పేరున అన్నదానాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాత జ్యోతుల

**జనసేన పార్టీ అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్**



శ్రీనివాసు మాట్లాడారు. జనసేన పార్టీ అధ్యక్షుడు కొణెదల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు సాయిప్రియ సేవా సమితి పేరుతో పిఠాపురంలో ప్రతీ శనివారం నిర్వహించే పశువుల సంతలోని రైతులు పాడి పశువుల అమ్మకం, కొనుగోళ్ల మధ్యవర్తులకు, వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగులకు, కోర్టు కక్షిదారులకు, పేదవారికి మధ్యాహ్నం అన్నదానాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పూర్వపు తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ వారాంతపు అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారని, నాటి నుండి నేటి వరకూ అవిరామంగా 200 వారాలను పూర్తి చేసుకున్నదని జ్యోతుల శ్రీనివాస్ వెల్లడించారు. ప్రతి శనివారం పగటిపూట 11-2 గంటల మధ్య తన సొంత నిధులతో ఉచిత అన్నపానీయ సదుపాయం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉన్నామని చెప్పారు. మా సాయి ప్రియా ట్రేడర్స్ టోకు కిరాణా వర్తకం ద్వారా నెల వారీ వస్తోన్న లాభాల నుండి కొంత మొత్తం నిధిని స్వచ్ఛందంగా కేటాయించి, దానితో ఈ సామాజిక సేవా కార్యక్రమాలను నిస్వార్థంగా, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నానని శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సమాజసేవా కార్యక్రమాలకు ప్రజలు, యువకులు, రైతులు, రాజకీయ నాయకులు తమ శ్రమదాన సేవలను అందిస్తున్నారని, వారందరికీ కృతజ్ఞతలు తెలుపు తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాడ జనసేనపార్టీ ఉపాధ్యక్షులు గొల్లపల్లి శివ, చేబ్రోలు జనసేన పార్టీ అధ్యక్షుడు అల్లం దొరబాబు, ఎ.మల్లవరం జనసేన పార్టీ అధ్యక్షుడు బాస్కర రెడ్డి, చెందుర్తి జనసేన పార్టీ అధ్యక్షుడు సూర్నీడి శ్రీను, దుర్గాడ విద్యా కమిటి చైర్మన్ శాఖా నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ కందా మాజీ ఎమ్.పి.టి.సి. సభ్యులు కొమ్మూరి కృష్ణ, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు పాల్గొన్నారు.

# అమెరికా నుంచి తిరిగొచ్చిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ తన అమెరికా పర్యటన ముగించుకుని నియోజకవర్గానికి శనివారం తిరిగి వచ్చారు. వస్తూనే నేరుగా నియోజక వర్గం కేంద్రం ప్రత్తిపాడులోని ప్రస్తుత నివాసానికి వెళ్ళకుండా నేరుగా పెదశంకర్లపూడిలోని తొలి స్వగృహానికి చేరుకున్నారు. ఆమె కుమారుడు సాయి తర్షిత్ (ప్రతీక్), కుమార్తె సత్యమాధురి (అమూల్య). ఈ పిల్లలు ఇద్దరూ వారి ఉన్నత చదువులకు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. కుమార్తె సత్యమాధురి అరిజోనా స్టేట్ యూనివర్సిటీలో బిజినెస్ అనలిటిక్స్ చదువుతున్నది. తన పిల్లల దగ్గర కొద్ది రోజుల పాటు స్వయంగా ఉండి వారి ఆలనా, పాలనా చూసుకునేందుకు ఎమ్మెల్యే బుధవారం ఏప్రిల్ 29 న అమెరికాకు వెళ్లారు. ఆమె హైదరాబాద్ లోని విమానాశ్రయం నుంచి నేరుగా అమెరికాకు పయనం అయ్యారు. ఆమె అమెరికాలో కేవలం 15 రోజుల పాటు మాత్రమే ఉంటారని అప్పట్లో వినిపించింది. అయితే దాదాపు 37 రోజుల తర్వాత ఎమ్మెల్యే స్వగ్రామానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే తిరిగి వచ్చిన సందర్భంగా పలువురు పార్టీ ప్రముఖులు, ఇతరులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మృతుల కుటుంబాలను ఆదుకున్న ప్రభుత్వం

**ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కుల పంపిణీ – పాల్గొన్న కూటమి నాయకులు**




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో ఉపాధి హామీ కూలీలు ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రమాదం జరిగిన వెంటనే కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ స్వయంగా బాధితులను పరామర్శించి, తక్షణ సాయం నిమిత్తం సొంత నిధులను మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ. 1 లక్ష చొప్పున తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించి, మీ కుటుంబాలకు అండదండలుగా ఉంటామని హామీ ఇచ్చారు, ఇచ్చిన హామీ నెరవేరుస్తూ శనివారం మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి మంజూరు చేసిన రూ. 3,00,000/- చొప్పున ఐదుగురు సంబంధిత కుటుంబాలకు మొత్తం రూ. 15 లక్షల విలువైన ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా చెక్కులను వారి ఇంటి వద్దకే వెళ్లి ఎమ్మెల్యే నానాజీ మరియు కూటమి ముఖ్యనాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ చనిపోయిన వారి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన క్షతగాత్రురాలితో పాటు, బాధిత కుటుంబాల అందరికీ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, కటకంశెట్టి ప్రభాకర్, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు, నూరుకుర్తి వెంకటేశ్వర రావు, రంబాల వెంకటేశ్వర రావు, పితాని లీల, బోళ్ల కృష్ణ మో వీరబాబు, పాంద్రంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్వేది రాష్ట్ర పండుగ హోదాపై హర్షం

**కృష్ణమ్మ వర్మ వారసులకు గుర్తింపు ఎక్కడ?**

**1800 ఎకరాలు దానం చేసిన కుటుంబాన్ని విస్మరించొద్దు : అగ్నికుల క్షత్రియుల డిమాండ్**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కళ్యాణోత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో జారీ చేయడాన్ని అగ్నికుల క్షత్రియ సమాజం స్వాగతించింది. అయితే ఆలయ వైభవానికి మూలకారకులైన అగ్నికుల క్షత్రియ సమాజాన్ని, ఆలయ నిర్మాతల వారసులను ప్రభుత్వం విస్మరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసింది. అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ప్రతినిధులు విడుదల చేసిన ప్రకటనలో, శతాబ్దాల క్రితం కొపనాతి కృష్ణమ్మ వర్మ తన సర్వస్వాన్ని ధారపోసి అంతర్వేది ఆలయాన్ని నిర్మించడమే కాకుండా, స్వామివారి నిత్య కైంకర్యాలు, ధూపదీప నైవేద్యాల నిర్వహణ కోసం సుమారు 1800 ఎకరాల భూమిని దానం చేశారని పేర్కొన్నారు. ఈ చారిత్రక విషయాన్ని 2020లో అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అధికారిక ట్విట్టర్ వేదికగా ప్రస్తావించారని గుర్తు చేశారు. అలాంటి మహానుభావుడి వారసులను ఇప్పటికీ ఆలయ శాశ్వత ధర్మకర్తలుగా గుర్తించకపోవడం అగ్నికుల క్షత్రియుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి రథోత్సవంలో



రథాన్ని లాగే తొలి హక్కు సంప్రదాయబద్ధంగా అగ్నికుల క్షత్రియులదేనని, వారి ప్రతినిధి చేతి స్పర్శ లేకుండా రథం కదలదనే ఆచారం నేటికీ కొనసాగుతోందని తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం త్యాగాలు చేసి, విస్తారమైన భూములను దానం చేసిన సమాజానికి తగిన గౌరవం దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొపనాతి కృష్ణమ్మ వర్మ వారసులను అంతర్వేది ఆలయ శాశ్వత ధర్మకర్తలుగా ప్రకటించాలి. ఆలయ పాలక మండలి కమిటీలో అగ్నికుల క్షత్రియులకు సముచిత స్థానం కల్పించాలి. రథోత్సవం సహా ఆలయ సంప్రదాయాల్లో వారికి ఉన్న ప్రథమ గౌరవాన్ని శాశ్వతంగా కొనసాగించాలి. ఆలయ భూములు, నిధుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని అగ్నికుల క్షత్రియ సమాజ సంక్షేమం, యువత విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల అభివృద్ధికి కేటాయించాలి. అంతర్వేది ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడం ఆనందదాయకమే అయినప్పటికీ, ఆలయ నిర్మాణానికి భూములు దానం చేసి చరిత్ర సృష్టించిన కుటుంబాలను విస్మరించడం సరికాదని సంఘం పేర్కొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకుని, కొపనాతి కృష్ణమ్మ వర్మ వారసులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరింది. డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే, తమ హక్కులు మరియు ఆత్మగౌరవ పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని అగ్నికుల క్షత్రియ సంఘం హెచ్చరించింది.

# 12 అంతస్తుల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



**డాక్టర్ పిట్టా వరప్రసాద్**

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మాధవపట్నం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఆవాస అపార్ట్మెంట్ 12 అంతస్తుల భవనం విషయంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి సమగ్ర విచారణ జరపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్ తలాటం సత్యకి డాక్టర్ పిట్టా వరప్రసాద్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడలి సత్యమూర్తి కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, AVASA అపార్ట్మెంట్‌కు B.A.No.1104/0025/B/KKDRMDL/SPV/2022, తేదీ 25-03-2022 ద్వారా స్టిల్ట్ + గ్రౌండ్ + 4 అంతస్తుల నివాస భవన నిర్మాణానికి మాత్రమే అనుమతులు మంజూరు చేయబడ్డాయి. అనంతరం G.O.Ms.No.273 MA&UD (M) శాఖ, తేదీ 19-12-2025 ప్రకారం సవరించిన నిబంధనల కింద స్టిల్ట్ ం గ్రౌండ్ ం 11 అంతస్తుల నిర్మాణానికి రివైజ్డ్ ప్లాన్ సమర్పించబడినప్పటికీ, ఆ ప్రతిపాదన ఇంకా సంబంధిత హై-రైజ్ కమిటీ మరియు ఉన్నత అధికారుల పరిశీలనలోనే ఉందని తెలిపారు. అయితే తుది అనుమతులు లేకుండానే ప్రస్తుతం 12 అంతస్తుల భవన నిర్మాణం కొనసాగుతున్నట్లు సమాచారం ఉందని, ఇది పట్టణ ప్రణాళికా నిబంధనలకు విరుద్ధమని డాక్టర్ పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు. ప్రజల భద్రత, అగ్నిమాపక ప్రమాణాలు, నిర్మాణ నాణ్యత మరియు పట్టణాభివృద్ధి నియమాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి, సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కౌడా చైర్మన్ సత్య మాట్లాడుతూ చట్టానికి విరుద్ధంగా ఉంటే వాళ్లపై తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**పార్టీ కోసం పూర్తి సమయం పనిచేసేవారికే**

# భవిష్యత్తులో ప్రాధాన్యత : ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో అమలాపురం రూరల్ మండల స్థాయి అవగాహన సదస్సు, అలాగే అమలాపురం పట్టణంలోని మెట్ల రమణబాబు స్వగృహంలో క్లస్టర్, కో-క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు, మండల పార్టీ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు పార్టీ కోసం పూర్తి సమయం పనిచేయాలని, సమయం కేటాయించని వారిని బాధ్యతల నుంచి తప్పించి చురుకైన వారికి అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 20 నుంచి 25 ఏళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా సరికొత్త ఓటర్ల జాబితా రూపొందుతుందని తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు జరిగే ఇంటింటి ఓటర్ల ధృవీకరణ కార్యక్రమంలో బూత్ స్థాయి ఏజెంట్లు చురుగ్గా పాల్గొని తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పార్టీ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందని పేర్కొంటూ, బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బూత్ స్థాయి అధికారులు బూత్ స్థాయి ఏజెంట్ల నుంచి సమాచారాన్ని తప్పనిసరిగా స్వీకరించాలని, ఒకవేళ ఆ సమాచారం తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే హక్కు కూడా ఉంటుందని తెలిపారు. అందువల్ల ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. పార్టీ వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ సాధారణంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులే ఎక్కువ బాధ్యతలు నిర్వహిస్తుంటారని, మిగిలిన సభ్యులు సమావేశాలకు మాత్రమే పరిమితమవుతుంటారని అన్నారు. అయితే క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ స్థాయి ఏజెంట్లు కేవలం సమావేశాలకు హాజరయ్యే వారు కాదని, క్షేత్రస్థాయిలో పూర్తి సమయం కేటాయించి పనిచేసే బాధ్యులని పేర్కొన్నారు. వార్డుల్లో పర్యటించడం, ఇంటింటికీ వెళ్లడం వంటి అనేక బాధ్యతలు వీరిపై ఉంటాయని, బూత్ కమిటీ కన్వీనర్లు తమ పనులను సమర్థంగా నిర్వహిస్తేనే పార్టీ బలోపేతం అవుతుందని చెప్పారు. యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు వాటిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవులతో పాటు ప్రభుత్వ పథకాలు, రహదారుల అభివృద్ధి పనులు, స్వయం ఉపాధి రుణాల విషయంలో ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తాను అండగా ఉంటానని, బూత్ స్థాయి ఖర్చులను భరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అయితే ప్రతి ఒక్కరూ సమయాన్ని కేటాయించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే మండల స్థాయి శిక్షణా కార్యక్రమాలు పూర్తయ్యాయని, జూన్ 15 నుంచి క్షేత్రస్థాయిలో ఓటర్ల ధృవీకరణ ప్రక్రియ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తిక్కిరెడ్డి నేతాజీ, క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీలు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట మునిగి ఆరుగురి మృతి

**స్నానానికి వెళ్లి ముగ్గురు.. ఈతకు వెళ్లి మరో ముగ్గురు**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విషాదం**







**బాన్సువాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మంజీరా నదిలో స్నానానికి వెళ్లి ముగ్గురు, సరదాగా నీటి కుంటలో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతిచెందిన విషాద ఘటనలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మంగల్‌పాడ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన పండరి.. బాన్సువాడ మండలం బుడ్మి శివారులోని మంజీర నది పక్కనున్న గుడి వద్ద విందు ఏర్పాటు చేశారు. దీనికి తన ముగ్గురు సోదరులు, ఇద్దరు సోదరీమణుల కుటుంబ సభ్యులను ఆహ్వానించారు. సాయంత్రం తిరిగి వెళ్లే సమయంలో పండరి సోదరి, లింగంపేట్ మండలం పరుమళ్ల గ్రామానికి చెందిన అనిత(35), ఆమె కుమార్తె శివాని(13), పండరి కుమార్తె పావని(15), పండరి మరో సోదరి సుజాత కుమారుడు భానుప్రసాద్ నదిలో స్నానానికి వెళ్లారు. లోతు గమనించకపోవడంతో నలుగురు నీటిలో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న ఇతర చిన్నారులు అరవడంతో పండరి సోదరుడు రవి వచ్చి నీటిలో మునిగిన వారిని ఒడ్డుకు చేర్చారు. వారిని బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అనిత, శివాని, పావని మృతిచెందారు. భానుప్రసాద్ ప్రాణాలతో ఉండటంతో చికిత్స అందించారు.

**మరో ఘటనలో చిన్నారులు...**

మరో ఘటనలో.. సరదాగా నీటి కుంటలో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌కు చెందిన మహేశ్ – లక్ష్మి దంపతుల పిల్లలు హరీశ్(10), వర్షిణి(5), సురేశ్ – పద్మ దంపతుల కుమారుడు అరవింద్(4) ఈత కోసం ఇళ్ల సమీపంలోని కుంటలోకి వెళ్లారు. ఈత రాకపోవడంతో నీటిలోకి దిగగానే మునిగి చనిపోయారు. తల్లిదండ్రులు వెతుకుతుండగా.. కాలనీ వాసులు కుంట వద్ద చిన్నారుల దుస్తులు గుర్తించి సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చిన్నారుల మృతదేహాలను వెలికితీసి ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు.




### మునికూడలి ఘాట్‌ను జాతీయ స్థాయి

# జాతీయ స్థాయి మోడల్ గ్రామీణ పుష్కర్ ఘాట్‌గా తీర్చిదిద్దాలి

## ఈనెల 18 - 20 మధ్య ఉప ముఖ్యమంత్రి పర్యటన - అప్పటికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి : కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పుష్కరాలు నేపథ్యంలో మునికూడలి గ్రామాన్ని జీరో లిక్విడ్ డిశ్చార్జ్, ఆధ్యాత్మిక-పర్యాటక కేంద్రంగా సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలని, భవిష్యత్ కోసం దిక్సూచిగా నిలపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సిద్ధం చేస్తున్న ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ వై.మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మునికూడలి ఘాట్‌ను జాతీయ స్థాయిలో ఆదర్శ గ్రామీణ పుష్కర్ ఘాట్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. మునికూడలి ఘాట్ అభివృద్ధిని కేవలం పుష్కర ఘాట్ పరిమితిలో కాకుండా ఆధ్యాత్మిక, పర్యాటక, పర్యావరణ పరిరక్షణ అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాఖలు అత్యంత మధ్య సమన్వయం చేస్తూ జాతీయ స్థాయిలో అధ్యయన అంశంగా నిలిచే విధంగా రూపుదిద్దాలని ఉప ముఖ్యమంత్రి కలెక్టర్ కు సూచించారు. ముఖ్యంగా "జీరో లిక్విడ్ డిశ్చార్జ్" లక్ష్యంగా మునికూడలి గ్రామంలో మురుగునీరు, వర్షపు నీటి నిర్వహణకు సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని, గోదావరి నదిలోకి ఎటువంటి మురుగునీరు చేరకుండా "మ్యాజిక్ డ్రెయిన్" విధానంతో ఏకీకృత ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, మునికూడలి




గ్రామంలో ఉన్న సోమేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల ఆధ్యాత్మిక విశిష్టతను దృష్టిలో ఉంచుకొని "శివరూపాయ విష్ణవే - విష్ణురూపాయ శివవే" అనే భావనకు అనుగుణంగా ఘాట్ అభివృద్ధి చేపడుతున్నట్లు వివరించారు. భక్తులు, పర్యాటకులకు ఉపయోగపడే విధంగా ధ్యాన మందిరం తరహా ఆధ్యాత్మిక కేంద్రం, విశ్రాంతి వసతులు, హారతి వేదికలు, పర్యాటక సదుపాయాలను అభివృద్ధి చేసే అవకాశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మునికూడలి ప్రాంతానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కూడా సమావేశంలో వివరించారు. ప్రాచీన కాలంలో 11వ, 14వ శతాబ్దాల ప్రాశస్త్యం ఇక్కడ నిక్షిప్తమై ఉందన్నారు. నైమిశారణ్య మునుల కూటమిగా ఇక్కడకు వచ్చి హోమాలు, జపాలు నిర్వహించే క్రమంలో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం చారిత్రక గ్రంథాలలో ప్రస్తావించబడిందన్నారు. సోమేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాలు ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఇక్కడ వెలిశాయని పేర్కొన్నారు. పుష్కరాల దృష్ట్యా కోరుకొండ మండలం ముగ్గళ్ళ, కాటవరం, కూనవరం, పోలవరం ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. గోకవరం - తొర్రేడు మార్గం ద్వారా మునికూడలికి చేరుకునే ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ సదుపాయాలపై కూడా ప్రణాళిక రూపొందిస్తున్నా మన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ, పుష్కర స్నానాల కోసం కోర్ బాత్ ఏరియాలో నాలుగు అడుగుల మేర నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం, పుష్కరాల నాటికి గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, తాగునీటి ట్యాప్ కనెక్షన్ అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలోని సుమారు 450 కుటుంబాల మౌలిక సదుపాయాల స్థితిగతులపై ఇంటింటి సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు, ఆర్ అండ్ బి శాఖలు సమన్వయంతో బుధవారం నాటికి ఏకీకృత కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పండ్ల చెట్లతో కూడిన విస్తృత హరితాభివృద్ధి, బండ్ విస్తరణ, నదీ తీర సుందరీకరణ వంటి అంశాలను కూడా ప్రణాళికలో చేర్చాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ మధ్య ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మునికూడలి గ్రామానికి సంబంధించిన విజువల్ డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ్ కోరారు. అభివృద్ధి ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది రూపు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో పుష్కర్ డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు, మునికూడలి ఆలయ అర్చకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వెదురుపాక శ్రీ విజయదుర్గా పీఠాధిపతి గాడ్ ఇకలేరు

### పార్థివ దేహానికి ఎమ్మెల్యేలు, ప్రముఖుల నివాళులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం శ్రీ విజయదుర్గా పీఠం పీఠాధిపతి శ్రీ వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) శుక్రవారం రాత్రి వృద్ధాప్య కారణాలతో శివైక్యం చెందారు. 90 సంవత్సరాల వయస్సులో ఆయన తుదిశ్వాస విడిచిన వార్తతో ఆధ్యాత్మిక లోకం విషాదంలో మునిగిపోయింది. 1936 జనవరి 19న జన్మించిన గాడ్ గారు, 1972లో శ్రీ విజయదుర్గా పీఠాన్ని స్థాపించి దాదాపు 54 సంవత్సరాల పాటు ఆధ్యాత్మిక సేవలు అందించారు. దేవీ ఉపాసన, ధార్మిక బోధనలు, యజ్ఞయాగాదుల ద్వారా వేలాది మంది భక్తులకు మార్గదర్శకత్వం వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లో కూడా ఆయనకు విశేష భక్త వర్గం ఉంది. శనివారం వెదురుపాకలో గాడ్ పార్థివ దేహానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాడ్ గారు తన ఆధ్యాత్మిక బోధనలతో లక్షలాది మంది భక్తుల అభిమానాన్ని సంపాదించారని, ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. అలాగే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తో పాటు సినీ ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి గాడ్ భౌతికకాయాన్ని దర్శించి నివాళులర్పించారు. అనంతరం రాజమహేంద్రవరంలో వేద పండితుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్ల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

# కోరుకొండ తాసిల్దార్‌గా ఎం.సునీత



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ తాసిల్దార్‌గా ఎం.సునీత బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తాసిల్దార్ సునీతకు డిప్యూటీ తాసిల్దార్ సాయిరాం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, మండల విఆర్‌ఓల సంఘ నాయకులు, రేషన్ డీలర్స్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈమె సీతానగరం మండలంలో డిప్యూటీ తాసిల్దార్‌గా పనిచేస్తూ, పదోన్నతిపై కోరుకొండ తాసిల్దార్ గా విచ్చేశారు. కోరుకొండ తాసిల్దార్ గా పనిచేసిన సుగుణ కొవ్వూరు ఆర్డీవో కార్యానికి బదిలీపై వెళ్లారు.

### రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా

# కోరుకొండ నరసన్న భూములు : మారిశెట్టి

### ఘన సన్మానాలు సరే- సమస్యకు పరిష్కారం ఎక్కడ?

### 15 రోజుల్లో పరిష్కరించకపోతే రెవెన్యూ కార్యాలయం ముట్టడి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవుడు వరమిచ్చినా పూజారి మోకాలు అడినట్టు చందనంగా జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారుల పనితీరు ఉందని రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కోరుకొండ హరే రామనగర్ లో ఆయన రైతులతో సమావేశం అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ కోరుకొండ నరసన్న భూములకు సంబంధించిన రైతుల సమస్య పరిష్కారంలో రెవిన్యూ అనుసరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్ర దేవాదాయశాఖ ధర్మాదాయ కమిషనర్, గత కలెక్టర్ కోరుకొండ నరసన్నకు చెందిన 259 ఎకరాల భూమిని 22(ఎ)1ఎ నుండి తొలగించినట్లు ఉత్తర్వులు వెలువరించిన నేటికి, వన్ బి, అడంగళ్ళలో రికార్డులను సరి చేయకపోవడం రెవెన్యూశాఖ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తుందన్నారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల 259 ఎకరాలను 22(ఎ) నుంచి ప్రభుత్వం తొలగించినట్లు ఆయన స్వయంగా పాత్రికేయుల సమక్షంలో ప్రకటించారని, దాంతో ఆయనకు ఘనంగా సత్కారాలు, రైతుల సంబరాలు అంబరాన్నంటాయని, 70 రోజులు గడిచిన నేటికీ సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ సిబ్బంది రెండు వారాల్లో నరసన్న భూములకు సంబంధించిన 22 (ఏ) సమస్యను పూర్తిగా పరిష్కరించకపోతే, రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపడతామని ప్రభుత్వానికి పత్రిక ముఖంగా తెలియజేస్తున్నా మన్నారు. రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కోరుకొండ మండలంలో అనేక కుటుంబాలు నేటికీ వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కాటూరి మోహన్, ఉప్పలపాటి అబ్బు, కోసూరి శ్రీనివాస్, నందూరి రామకృష్ణ,గరగ మధు, కోడినాగుల ప్రసాద్, కప్పల మధు, కేతినేని నాని, నెక్కంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

# ముంపు సమస్యల పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా వెళుతున్నాం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో ముంపు సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, అవసరమైన చోట్ల డ్రెయినేజీ వ్యవస్థను బలోపేతం చేస్తూ వరద నీటి నిల్వలను నివారించే చర్యలను వేగవంతం చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక 38వ డివిజన్ పరిధిలోని లలితానగర్ చైతన్య ఆసుపత్రి సమీపంలో రూ.4.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న 300 మిల్లీమీటర్ల సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ నగరంలోని ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. లలితానగర్ ప్రాంతంలో చాలా కాలంగా డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ సీసీ డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. నిర్మాణం పూర్తయిన తర్వాత వర్షపు నీరు, మురుగునీరు సులభంగా పారిపోయేలా ఏర్పాట్లు జరుగుతాయని, దీంతో రహదారులపై నీరు నిల్వ ఉండే సమస్య తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డుల వారీగా అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం, స్థానిక సంస్థల సమన్వయంతో నగరాన్ని మరింత పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### టేబుల్ టెన్నిస్ డబుల్స్ లీగ్ పోటీల్లో

# రాజమండ్రి అకాడమీ క్రీడాకారుల సత్తా

### ప్రతిభతో అన్ని బహుమతులు కైవసం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాల్ ఎదురుగా ఉన్న గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ డబుల్స్ పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబర్చి అన్ని బహుమతులను కైవసం చేసుకున్నారని అకాడమీ కోచ్ వి.టి.వి. సుబ్బారావు తెలిపారు. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోటీలో టీ. ప్రభాత్ సాయి, జీ. తాన్యశ్రీ జంట విజేతలుగా నిలిచింది. త్రిషాల్ రాజ్‌కుమార్, సిరి పావని జంటపై వీరు విజయం సాధించి ప్రథమ బహుమతిని అందుకున్నారు. ద్వితీయ స్థానంలో త్రిషాల్ రాజ్‌కుమార్, సిరి పావని జంట నిలిచింది. అలాగే సాయి జోషి - నమన్ జైన్ జంట, మోహిత్ శ్రీ కపిష్ - శివాని జంటలు సెమీఫైనల్స్‌కు చేరుకుని తృతీయ బహుమతులు సాధించాయి. కార్యక్రమంలో వరదా రవి కిరణ్, సూరపురెడ్డి సూర్యప్రకాశ్, అడబాల శ్రీకాంత్, గిడుతూరి అనురాధ, దండమూడి లక్ష్మి తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు. క్రీడాకారుల ప్రతిభ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# గీత కార్మికుల ఆర్థికాభివృద్ధికి నీరా ప్రాజెక్ట్ కీలకం

### ఎక్సైజ్ కమిషనర్‌ను కలిసిన రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్‌ని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్, నీరా టాడీ టాపర్స్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి కలిసి నీరా ప్రాజెక్టు అమలు, గీత కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గీత కార్మికుల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని తెలిపారు. ఆ దిశగా గీత వృత్తికి సరికొత్త గుర్తింపు తీసుకురావడంతో పాటు గీత కార్మికుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో నీరా ప్రాజెక్టును ప్రారంభించామని పేర్కొన్నారు. తాటి, ఈత చెట్ల నుంచి సహజసిద్ధంగా లభించే స్వచ్ఛమైన, తీపి రసమైన "నీరా"ను సేకరించి మార్కెట్‌లోకి తీసుకురావడం ద్వారా గీత కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని వివరించారు. నీరా ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చి గీత కార్మికుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో కల్లుగీత నిర్వహణ సమయంలో చెట్లపై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయిన గీత కార్మికులకు ఆర్థిక భరోసా లేదని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రమాద బీమా, ఆర్థిక సహాయం వంటి పథకాల ద్వారా కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని తెలిపారు. మరో 20 రోజుల్లో నీరా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కొలిక్కి వస్తుందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్న తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా నీరా ప్రాజెక్టును అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో నీరా ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రత్యేక నీరా కేఫ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల నీరా ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ లభించడంతో పాటు గీత కార్మికుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీరా ప్రాజెక్టు విజయవంతమైన అమలుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, గీత కార్మికులకు మరింత ప్రయోజనం చేకూరేలా తీసుకోవాల్సిన కార్యక్రమాలపై కమిషనర్ తో చర్చించినట్లు సత్తిబాబు తెలిపారు. గీత కార్మికుల జీవనోపాధి మెరుగుదల, వారి సంక్షేమం, వృత్తి అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ప్రాథమిక విద్యకు పునాది అభ్యసనం

# ఎంతో కీలకమైనది

### సమగ్ర శిక్ష ఏపీసీ సుభాషిణి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎఫ్ఎల్ఎన్ విధానంలో ఒకటి రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు వారం రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసి ఎస్ సుభాషిణి తెలిపారు. గాడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) ద్వారా ప్రాథమిక స్థాయిలో బోధనాభ్యాసన పద్ధతులను ఈ శిక్షణలో వివరిస్తున్నారని, ఈ నూతన విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాలను కూడా ఎఫ్ఎల్ఎన్‌కు అనుగుణంగా రూపొందించారని ఉపాధ్యాయులు ఈ శిక్షణా కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో నిర్వహిస్తున్న అంశాలను ఆమె పరిశీలించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో మాట్లాడి వారి అభిప్రా యాలు తెలుసుకున్నారు. మూడవ తరగతిలోకి వచ్చేసరికి ఆ విద్యార్థికి ధారాళంగా చదవడం రాయడం సాంఖ్యక శాస్త్రం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నైపుణ్యాలు సాధిం చడం పైనే విద్యార్థి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులందరూ తదను గుణంగా తమ బోధనా వద్ధతులను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ నిపుణ భారత్ లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుజాత, కెఆర్పి మల్లేశ్వరి, డిఆర్పీలు పాల్గొన్నారు.

# సీతానగరం మండల బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పొట్నూరిశివ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పొట్లూరి శివను నియమించినట్లు మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గ కో కన్వీనర్ అడబాల గణపతి రావు చేతులమీదుగా సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి,ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మట్టాడి వెంకటరమణ ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్ర మంలో గూడపాటి జయరాం, సత్యం రామకృష్ణ,మద్దాల కొండలరావు,పిడుగు శ్రీను, సాంబేపు బాలయోగి, ఖండవల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# 5 నెలల్లో మూడు సినిమాలు.. రెండు బ్లాక్ బస్టర్స్..

## ఈ హీరోయిన్ క్రేజ్ చూస్తే మతిపోవాల్సిందే గురూ..




2025వ సంవత్సరంలోని ఐదు నెలల్లో సంచనలం సృష్టించింది ఓ హీరోయిన్. ఈ స్వల్ప వ్యవధిలోనే ఆమె నటించిన మూడు ప్రధాన చిత్రాలు ఒకదాని తర్వాత ఒకటి విడుదలయ్యాయి. అంతేకాదు అన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్స్ అయ్యాయి. ఆమె మొదటి చిత్రం వసూళ్ల రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి బ్లాక్‌బస్టర్‌గా నిలవగా, భారీ బడ్జెట్ , ఒక సూపర్‌స్టార్ ఉన్నప్పటికీ ఆమె రెండవ చిత్రం మిశ్రమ స్పందన అందుకుంది. నటి తన మూడవ చిత్రంతో మరోసారి హిట్టు అందుకుంది. గత సంవత్సరం దక్షిణాది సినిమా అగ్ర కథానాయిక ఒకటి రెండు కాదు, ఏకంగా మూడు ప్రధాన చిత్రాలు వెండితెరపై విడుదలయ్యాయి. మొదటి చిత్రం అన్ని వసూళ్ల రికార్డులను బద్దలు కొట్టి బ్లాక్‌బస్టర్‌గా నిలవగా, ఒక సూపర్‌స్టార్ ఉన్నప్పటికీ రెండవ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందన అందుకుంది. మూడవ చిత్రం మాత్రం భారీ విజయం సాధించింది. ఆమె మరెవరో కాదు హీరోయిన్ రష్మిక మందన్న. 2025లో ఆమె నటించిన మూడు ప్రధాన చిత్రాలు ఒకదాని తర్వాత ఒకటి విడుదలయ్యాయి. అయితే, వాటిలో మూడు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాయి. ఆ మూడు రష్మిక మందన్న చిత్రాలను ఇప్పుడు చూద్దాం. రష్మిక మందన్నకు 2025 సంవత్సరం అద్భుతంగా ప్రారంభమైంది. 2025 ఫిబ్రవరి 14న విడుదలైన చారిత్రక చిత్రం 'ఛావా' బాక్సాఫీస్ చరిత్ర సృష్టించింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విక్కీ కౌశల్ ఛత్రపతి సంభాజీ మహారాజ్‌గా నటించగా, రష్మిక మందన్న ఆయన భార్య యేశు బాయి పాత్రను పోషించారు. సంభాజీ మహారాజ్ శౌర్యం, మొఘలులకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం, యేశుబాయితో ఆయనకున్న భావోద్వేగ బంధం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. సుమారు రూ.150 కోట్ల (దాదాపు ?1.5 బిలియన్) బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ఒక్క భారతదేశంలోనే ?400 కోట్ల మార్కును అధిగమించింది. 'ఛావా' విజయం తర్వాత, రష్మిక మందన్న ఈద్ పండుగ సందర్భంగా బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్' (మార్చి 30, 2025) చిత్రంలో నేరుగా నటించింది. సాజిద్ నడియాద్వాలా నిర్మించిన ఈ చిత్రం బంపర్ ఓపెనింగ్ సాధిస్తుందని అంచనా వేశారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్-డ్రామాలో సల్మాన్ ఖాన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రలలో నటించగా, సత్యరాజ్, శర్మన్ జోషి కూడా కీలక పాత్రలలో కనిపించారు. సామాజిక-రాజకీయ నేపథ్యంతో తెరకెక్కిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో, రష్మిక సల్మాన్ ప్రేయసి పాత్రను పోషించింది. భారీ తారాగణం , సల్మాన్ ఖాన్ పారితోషికం కారణంగా, ఈ సినిమా బడ్జెట్ సుమారు 200 కోట్ల రూపాయలు ఉన్నట్లు సమాచారం. అయితే, బలహీనమైన కథనం , పేలవమైన సమీక్షల వల్ల ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. భారత మార్కెట్‌లో ఈ చిత్రం కేవలం 103 కోట్ల రూపాయల నికర వసూళ్లను మాత్రమే సాధించగా, ప్రపంచవ్యాప్తంగా దీని స్థూల వసూళ్లు కేవలం 176 కోట్ల రూపాయలకే పరిమితమయ్యాయి. ఈ రెండు చిత్రాల తర్వాత జూన్‌లో పాన్-ఇండియా చిత్రం 'కుబేర' విడుదలైంది. ఈ క్రైమ్-డ్రామాలో రష్మిక మందన్నతో పాటు దక్షిణాది సూపర్‌స్టార్లైన ధనుష్, నాగార్జున అక్కినేని, జిమ్ సర్భ్ నటించారు. ఈ చిత్రం కథ ముంబై మురికివాడలు , కార్పొరేట్ ప్రపంచంలోని చీకటి అండర్‌వరల్డ్, అక్రమ చమురు వ్యాపారం , మనీలాండరింగ్ వంటి వాటి చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రంలో రష్మిక, సమీరా అనే ఉద్యోగిని పాత్రను పోషించారు. రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో భారీ బడ్జెట్‌తో నిర్మించారు. శాక్‌నిల్క్ నివేదిక ప్రకారం, "కుబేర" భారతదేశంలో ?106 కోట్లు వసూలు చేయగా, ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు ?138 కోట్లుగా ఉన్నాయి. రష్మిక, ధనుష్ నటించిన ఈ చిత్రం, తన బడ్జెట్‌ను తిరిగి రాబట్టుకుని హిట్‌గా నిలిచింది.

## ఆ 30 నిముషాలు అదిరిపోతుంది..


# థియేటర్స్‌లో పూనకాలే..

## సంచలన విషయాలు చెప్పిన విజయేంద్రప్రసాద్



సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పుడు వారణాసి సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ మూవీపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. గుంటూరు కారం తర్వాత మహేష్ నటిస్తున్న సినిమా ఇది. అలాగే ఈ చిత్రానికి ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు నటిస్తున్న లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ వారణాసి. దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం మహేష్ బాబు అభిమానులంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. గుంటూరు కారం లాంటి ఫ్లాప్ తర్వాత మహేష్ బాబు చేస్తున్న సినిమా కావడం, అలాగే అపజయాలు ఎరుగని దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో వారణాసి సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన పోస్టర్స్, టైటిల్ టీజర్ సినిమా పై అంచనాలను భారీగాపెంచేశాయి. అంతేకాకుండా ఈ సినిమాను పాన్ వరల్డ్ రేంజ్ లో రూపొందిస్తున్నారు రాజమౌళి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. అయితే ఈ సినిమా కథ ఏంటి, రాజమౌళి ఈ సారి ఎలాంటి కథతో ప్రేక్షకులను మెప్పించనున్నాడని ఆడియన్స్ అందరూ ఎదురుచూస్తున్నారు. తాజాగా రాజమౌళి తండ్రి, కథ రచయిత విజయేంద్రప్రసాద్ వారణాసి సినిమా స్టోరీ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో ఓ ఈవెంట్ లో మాట్లాడుతూ వారణాసిలో ఒక 30 మినిట్స్ సీక్వెన్స్ ఇండియాను షేక్ చేస్తుందని అన్నారు. కాగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విజయేంద్రప్రసాద్ కు వారణాసిలో 30నిమిషాల సీన్‌కి సంబందించిన ప్రశ్న ఎదురైంది. దీని గురించి ఆయన మాట్లాడుతూ ఆ సీక్వెన్స్ శ్రీరాముడికి, కుంభకర్ణుడికి మధ్య జరిగే యుద్ధం.. మీకు ట్రైలర్ లో చూపించారుగా.. రాముడు వనరుల మీద నిలబడి కుంభకర్ణుడితో యుద్ధం చేస్తున్నట్టు ఉంటుంది. అందులో హనుమంతుడితోకపై రథం కూడా కనిపించించిందిగా.. అదే స్పెల్ బౌండ్ అని విజయంద్రప్రసాద్ అన్నారు. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అలాగే వారణాసి సినిమాలో మహేష్ బాబు రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తాడని తెలుస్తుంది. రుద్ర పాత్రతోపాటు శ్రీరాముడిగానూ కనిపించనున్నాడని అంటున్నారు.ఇక వారణాసిలో మందాకినిగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంకా చోప్రా జోనాస్ అలాగే కుంభ అనే నెగెటివ్ రోల్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న వారణాసి సినిమాను విడుదల చేయాలనీ సన్నాహాలు చేస్తున్నారు మూవీ టీమ్.

# పోరాడినా దక్కని ఫలితం.. వరుస సెట్లలో ఓడిపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్!



ప్రపంచ నంబర్ వన్, సౌత్ కొరియా క్రీడాకారిణి ఆన్ సే యంగ్ చేతిలో సింధు వరుస గేమ్స్ లో పరాజయం పాలయ్యారు. గత వారం జరిగిన సింగపూర్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో కూడా సింధు ఈ కొరియన్ స్టార్ చేతిలోనే ఓడిపోవడం గమనార్హం. భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు ఇండోనేషియా ఓపెన్ టోర్నమెంట్‌లో భారీ షాక్ తగిలింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్ (రౌండ్ ఆఫ్ 16) మ్యాచ్‌లోనే ఆమె ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. ప్రపంచ నంబర్ వన్, సౌత్ కొరియా క్రీడాకారిణి ఆన్ సే యంగ్ చేతిలో సింధు వరుస గేమ్స్ లో పరాజయం పాలయ్యారు. గత వారం జరిగిన సింగపూర్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో కూడా సింధు ఈ కొరియన్ స్టార్ చేతిలోనే ఓడిపోవడం గమనార్హం.

**మొదటి గేమ్‌లో గట్టి పోటీ ఇచ్చినా తప్పని ఓటమి**

థాయిలాండ్‌కు చెందిన బుసానన్ ఒంగ్‌బామ్రుంగ్‌ఫాన్‌పై తొలి రౌండ్‌లో ఘన విజయం సాధించి మంచి ఊపు మీదున్న సింధు.. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా ఆన్ సే యంగ్‌పై గెలవాలని గట్టి పట్టుదలతో కోర్టులోకి దిగింది. మొదటి గేమ్ ప్రారంభంలో ఇద్దరి మధ్య పోరు చాలా ఆసక్తికరంగా సాగింది. ఒక దశలో ఇద్దరూ 10-10 పాయింట్లతో సమానంగా నిలిచారు. సింధు తన అటాకింగ్ గేమ్‌తో టాప్ సీడ్ ప్లేయర్‌ను కాస్త ఇబ్బంది పెట్టి 15-14తో ముందంజలో నిలిచింది. కానీ ఆన్ సే యంగ్ వెంటనే పుంజుకుని వరుస పాయింట్లతో 19-16 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఏకంగా 41 షాట్ల సుదీర్ఘ ర్యాలీతో సహా వరుసగా రెండు పాయింట్లు సాధించి మొదటి గేమ్‌ను 21-17తో కొరియన్ స్టార్ కైవసం చేసుకుంది.

**రెండో గేమ్‌లో పూర్తిగా చేతులెత్తేసిన సింధు**

మొదటి గేమ్ కోల్పోయిన ఒత్తిడి సింధుపై రెండో గేమ్‌లో స్పష్టంగా కనిపించింది. ఆన్ సే యంగ్ కోర్టు అంతటా అద్భుతమైన మూవ్‌మెంట్స్, స్థిరత్వంతో ఆడుతూ త్వరగా 13-6తో భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. సింధు మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి శతవిధాలా ప్రయత్నించి, కొన్ని పాయింట్ల తేడాని తగ్గించగలిగినప్పటికీ.. కొరియన్ క్రీడాకారిణి మ్యాచ్‌పై తన పట్టును ఏమాత్రం కోల్పోలేదు. చివరికి ఏకపక్షంగా సాగిన ఈ రెండో గేమ్‌ను కూడా ఆన్ సే యంగ్ 21-14తో సొంతం చేసుకుంది. దీంతో కేవలం వరుస సెట్లలోనే మ్యాచ్‌ను ముగించి ఆమె క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

**కొనసాగుతున్న ఓటముల పరంపర**

ఈ తాజా ఓటమితో ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సే యంగ్‌పై సింధు వరుసగా 10వ సారి ఓటమిని చవిచూసినట్లయింది. వీరిద్దరి మధ్య జరిగిన ముఖాముఖి పోరులో సింధు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో కూడా కొరియన్ స్టార్‌ను ఓడించలేకపోవడం గమనార్హం. కాగా, ఇటీవలి కాలంలో అంతర్జాతీయ ప్రయాణాల సమయంలో అమెరికా-ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతల వల్ల దుబాయ్ మీదుగా ప్రయాణించడం ఎంత భయానకంగా అనిపించిందో సింధు గుర్తుచేసుకున్న వీడియోలు వైరల్ అవుతున్న తరుణంలో, కోర్టులో కూడా ఆమెకు నిరాశే ఎదురైంది.

## హిస్టరీ క్రియేట్ చేయడానికి రెడీ అయిన మెస్సీ..

# 96 ఏళ్ల వరల్డ్ కప్ రికార్డు బద్దలవ్వడం ఖాయమా?

జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఫిఫా వరల్డ్ కప్ 2026 లో అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యాడు. అత్యధిక గోల్స్ రికార్డు కు అతను చాలా దగ్గరగా ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫిఫా వరల్డ్ కప్ 2026 మహాసంగ్రామానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జూన్ 11 నుంచి ఈ మెగా టోర్నమెంట్ అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. ఈసారి ఫుట్‌బాల్ చరిత్రలోనే మొదటిసారిగా యూఎస్‌ఏ, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నాయి. విశ్వవిజేతగా నిలిచేందుకు ప్రపంచ నలుమూలల నుంచి రికార్డు స్థాయిలో 48 జట్లు ఈ టోర్నీలో తలపడనున్నాయి. ఈ ఫుట్‌బాల్ పండగలో ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడాకారులు లైనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డోలతో పాటు ఫ్రాన్స్ యువ సంచలనం కిలియన్ ఎంబాప్పే వంటి టాప్ ప్లేయర్లు తమ దేశాల తరఫున బరిలోకి దిగుతున్నారు. దాదాపు 96 ఏళ్ల చరిత్ర కలిగిన ఫిఫా వరల్డ్ కప్‌లో ఇప్పటివరకు ఎందరో ఆటగాళ్లు రికార్డులు సృష్టించారు. అయితే ఈ 2026 వరల్డ్ కప్‌లో అర్జెంటీనా లెజెండ్ లైనల్ మెస్సీ ఒక అసాధారణమైన చారిత్రాత్మక రికార్డును బద్దలు కొట్టే ముంగిట నిలిచాడు.

**వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ రికార్డ్ ఎవరిదంటే?**

ఫిఫా ప్రపంచకప్ సుదీర్ఘ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఒక్క ఆటగాడు కూడా కనీసం 20 గోల్స్ మార్కును అందుకోలేకపోయాడు. ప్రస్తుతం వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన రికార్డు జర్మనీకి చెందిన మిరోస్లావ్ క్లోజ్ (16 గోల్స్) పేరిట ఉంది. బ్రెజిల్ దిగ్గజం రొనాల్డో నాజారియో 15 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక మన లైనల్ మెస్సీ ఇప్పటివరకు ఆడిన ప్రపంచకప్ మ్యాచుల్లో మొత్తం 13 గోల్స్ చేసి ఈ ఆల్‌టైమ్ లిస్టులో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు.


**చరిత్ర సృష్టించడానికి మెస్సీకి కావాల్సింది జస్ట్ 4 గోల్స్**

2026 లో మెస్సీ తన కెరీర్‌లో ఆరో ప్రపంచకప్‌ను ఆడబోతున్నాడు. ఇప్పటివరకు వరల్డ్ కప్‌లలో అత్యధికంగా 26 మ్యాచ్‌లు ఆడిన అనుభవం మెస్సీకి ఉంది. ఈ 2026 టోర్నమెంట్‌లో మెస్సీ గనుక మరో 4 గోల్స్ సాధిస్తే.. అతను 17 గోల్స్‌తో ఫిఫా వరల్డ్ కప్ 96 ఏళ్ల చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన ఏకైక నంబర్ వన్ ఆటగాడిగా రికార్డులకెక్కుతాడు. మెస్సీ ప్రస్తుతమున్న సూపర్ ఫామ్ చూస్తుంటే ఈ మైలురాయిని అందుకోవడం పెద్ద కష్టమేమీ కాదని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రేసులో వెనుకబడ్డ క్రిస్టియానో రొనాల్డో**

మెస్సీకి సమకాలీన ఆటగాడిగా, గట్టి పోటీదారుడిగా భావించే పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఈ ఆల్‌టైమ్ టాప్ గోల్ స్కోరర్ల లిస్టులో చాలా వెనుకబడి ఉన్నాడు. రొనాల్డో ఇప్పటివరకు 6 వరల్డ్ కప్‌లలో 22 మ్యాచ్‌లు ఆడినప్పటికీ కేవలం 8 గోల్స్ మాత్రమే చేయగలిగాడు. దీంతో అత్యధిక గోల్స్ చేసిన వారి జాబితాలో రొనాల్డో పేరు టాప్ రేసులో ఎక్కడా కనిపించడం లేదు.

**మెస్సీ రికార్డుకు ఎసరు పెడుతున్న యంగ్ గన్ ఎంబాప్పే**



మరోవైపు ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ కిలియన్ ఎంబాప్పే చాలా వేగంగా దూసుకుపోతున్నాడు. కేవలం 27 ఏళ్ల వయస్సులోనే అతను ప్రపంచకప్‌లలో ఏకంగా 12 గోల్స్ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గత 2022 వరల్డ్ కప్‌లోనే ఎంబాప్పే ఏకంగా 8 గోల్స్ కొట్టి సంచలనం సృష్టించాడు. జర్మనీ ప్లేయర్ క్లోజ్ రికార్డును బద్దలు కొట్టడానికి ఎంబాప్పేకు కేవలం 5 గోల్స్ మాత్రమే అవసరం. ఈ టోర్నీలో మెస్సీ, ఎంబాప్పేలలో ఎవరు సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పుతారో చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com